

# ఏవమ ఇంద్రజిత్

వాసిరెడ్డి సీతాదేవి

# "ఏవం ఇంద్రజిత్"

-వాసిరెడ్డి సీతాదేవి.

## మొదటి అంకం

[టేబుల్ మీద కాగితాలకట్టలు పడివున్నాయి. ప్రేక్షకులవైపు వీపు పెట్టి రచయిత ఏదో రాస్తూవున్నాడు. చాలాసేపటినుండి రాస్తూ ఉండి ఉండవచ్చును. 'పిన్ని' ప్రవేశిస్తుంది. ఏదో అనాలి కనక పిన్ని అన్నాం- తల్లి,అత్త , పెద్దమ్మ ఏదైనా అనొచ్చు! పిన్ని చిరాకుతో వస్తుంది]

పిన్ని: నీ వ్యవహారం ఏమిటో నాకు బొత్తిగా తెలియటం లేదు.

(రచనయిత మౌనం)

వినిపిస్తున్నదా? అన్నం తింటావా లేదా? దేనికైనా ఒక హద్దంటూ వుండాలి. మాట్లాడవేం?

రచయిత: ఇదుగో వచ్చేస్తున్నా!

పిన్ని: ఈ మాట యిప్పటికి మూడుసార్లు అన్నావ్! ఇదే ఆఖరుసారిగా చెపుతున్నా_ ఆ తర్వాత నీ ఇష్టం!

రచ: ఈ మాటే నువ్వుకూడా మూడుసార్లు చెప్పావ్!

పిన్ని: సరే నీ యిష్టం! రాత్రిలేదు. పగలులేదు. ఎప్పుడు చూసినా రాత-రాత-రాత! తిండీ తిప్పలు అక్కర్లేదు. ఈ రాసిందంతా ఏం చేస్తావో ఆ భగవంతుడికే తెలియాలి.

[పిన్ని సణుక్కుంటూ వెళ్ళిపోతుంది. అప్పటికే రాయడం ఆపేశాడు. రాసిన కాగితాన్ని చదువుతాడు. చదువుతూ చదువుతూలేచి నిల్చుంటాడు. ఒక అమ్మాయి ప్రవేశిస్తుంది. ఆ అమ్మాయి పేరు 'మానసి' అనుకుందాం!]

మానసి: పూర్తయిందా?

రచ: లేదు.

మా: ఏం రాశావు? నాకు వినిపిస్తావా?

రచ: ఏం రాయలేదు.

(కాగితాలు చింపేస్తాడు)

మా : అరే చింపేశావా?

రచ : ఏమీ రాయలేదు. రాయటానికి ఏమైనా ఉంటేగా?

మా : ఏమీ లేదా?

రచ : లేదు. ఏం రాయను? ఎవర్ని గురించి రాయను? నాకు తెలిసిన వాళ్ళంతమంది? వాళ్ళ గురించి తెలిసిందికూడా ఏమీలేదు.

మా:(ప్రేక్షకులను చూపిస్తూ) నీ ఎదురుగా యింతమంది వున్నారు! ఏ ఒక్కర్ని గురించీ నీకు తెల;తెలియదా?

రచ: వీళ్ళా? ఒకళ్ళిద్దరు తెలిసినట్లే వున్నారు. కానీ వాళ్ళను గురించి నాటకం రాయటానికి ఏముంది?

మా: ప్రయత్నించు.

రచ: చాలా ప్రయత్నించాను.

[కాగితాల ముక్కలు విసిరిపారేసి రచయిత టేబుల్ దగ్గరకు వెళ్తాడు. కొంచెంసేపు నిల్చుని మానసి చిన్నగా వెళ్ళిపోతుంది. రచయిత ఒకసారి గిర్రున తిరిగి ముందుకొస్తాడు. అదే సమయంలో ఆడిటోరియంలోకి నలుగురు వ్యక్తులు ప్రవేశించి సీట్లకోసం వెతుక్కుంటూ వుంటారు. రచయిత వాళ్ళను పిలుస్తాడు.]

రచ: ఏమండీ! ఇలా రండి !

[వచ్చినవ్యక్తులు వారిని పిలుస్తున్నాట్లు గ్రహించరు.]

రచ: మిమ్మల్నే నండీ! ఒకసారి యిలా రండి!

1. ప్రేక్ష: మమ్మల్నా?

రచ: అవును మిమ్మల్నే! ఒకసారి యిలా దయచెయ్యండి!

2.ప్రేక్ష: అందరం రావాలా!

3.ప్రేక్ష:స్టేజి మీదకా?

రచ: అవును! రండి! మీతో చాలా ముఖ్యమైన పనుంది.
[నలుగురూ స్టేజి దగ్గరకు వెళతారు.]

1.ప్రే: పైకి ఎలా రావాలి?

రచ: ఇటు ! ఇటు ! మెట్లు వున్నాయ్!
[నలుగురూ స్టేజి మీదకు వస్తారు.]

రచ: మీ పేర్లు తెలుసుకోవచ్చునా?

1.ప్రే:అమల్ కుమార్ !

రచ : మీరు?

1.ప్రే: విమల్ కుమార్ !
(రచయిత 3వ ప్రేక్షకునివైపు చూస్తాడు.)

3.ప్రే: కమల్ కుమార్!

రచ: మీ పేరు ?

4.ప్రే: నిర్మల్ కుమా...

రచ:(గట్టిగా అరుస్తూ) అబద్ధం!
[స్థబ్దత నలుగురూ తెల్లముఖాలు వేస్తారు. స్థిరంగా బిగుసుకొని వుండిపోతారు.]

రచ: అమల, విమల్, కమల్, నిర్మల్ -కాదు- మీ పేరు నిర్మల్ కావటానికి వీల్లేదు. నిజం చెప్పండి! మీ పేరేమిటి?

[స్టేజిమీద చీకటి వ్యాపిస్తుంది. అమల్, విమల్, కమల్ వెనక్కు వెళ్ళి నిల్చుంటారు. నాల్గవ ప్రేక్షకుడు స్టేజి మధ్యలో వుంటాడు. చీకటిని చీల్చు కుంటూ రచయిత కంఠస్వరం వినిపిస్తుంది.]

రచ: మీ పేరేమిటి?

4.ప్రే:ఇంద్రజిత్ !

రచ: అబద్ధమెందుకు చెప్పావ్?

ఇంద్ర: భయంవేసి.

రచ: భయమా? ఎందుకూ?

ఇంద్ర: అశాంతికి! నియమ విరుద్ధంగా చేసిన పనికి  లభించేది అ శాంతేగా?

రచ: మీరు మీ పేరు నిర్మల్ అనే చెబుతుంటారా?

ఇం: లేదు. ఇప్పుడే మొదటిసారి అలా చెప్పాను.

రచ: ఎందుకు?

ఇం: వయస్సు వచ్చేసింది కనుక! వయస్సు వచ్చాక ఆనందం అంటే, సుఖం అంటే కూడా భయంవేస్తుంది. ఈ వయసు కోరుకొనేది శాంతి ఒక్కటే:

[ఇంద్రజిత్ ను ఒక దట్టమైన మేఘం కప్పివేయడం అవసరం]

రచ: మీ వయస్సెంత?

ఇం: వంద! ఊహుఁ.... రెండు వందలు! నాకు తెలియదు. మెట్రిక్యులేషన్ సర్టిఫికేట్ ప్రకారం ముప్ఫయ్ ఐదు.

రచ: జన్మస్థానం?

ఇం: హైదరాబాద్!

రచ:చదువు సంధ్యలు?

ఇం:హైదరాబాద్!

రచ:ఉద్యోగం?

ఇం:హైదరాబాద్ లో!

రచ : వివాహం?

ఇం: హైదరాబాద్ లో!

రచ: మృత్యువు?

ఇం : ఇంకా సమయం వుంది!
[నిశ్శబ్దం. చీకట్లో ఇంద్రజిత్ స్వరం వినిపిస్తుంది.]

ఇం: కాదు.....కాదు....నాకేమీ తెలియటం లేదు.
[చిన్నగా స్టేజిమీద వెలుతురు పడుతుంది. ఇంద్రజిత్, అతని వెనుక వరుసగా, అమల్ , విమల్, కమల్ బొమ్మల్లా నిల్చునివుంటారు. వారి దృష్టి శూన్యాన్ని చూస్తూ వుంటుంది. రచయిత ప్రేక్షకులవైపు చూస్తాడు. అలసిపోయిన మాస్టరులా మాట్లాట్టం ప్రారంభిస్తాడు.]

రచ:1961. సెన్ సెన్ ప్రకారం హైదరాబాదు జనసంఖ్య 2, 92 , 12, 891. ఇందులో సగంమందికి పైగా గ్రాడ్యుయేట్స్ -ఉన్నత విద్యవంతులు. వీరిపేర్లు వేరయినా వీరి ఆర్థిక పరిస్థితులలో బేదం వున్నా వీరంతా మధ్య తరగతికి చెందిన వ్యక్తులు. వీరంతా బుద్దిజీవులు కేవలం బుద్దితోనే బ్రతకటానికి ప్రయత్నిస్తే ఇందులో చాలామందిక ఆకలితో చచ్చివుండేవాళ్ళు. డిగ్రీని విద్యగా అంగీకరిస్తే, వీరంతా విద్యావంతులు చిన్నవాళ్ళను దూరం ఉంచుతారు కనుక వీరంతా పెద్దవాళ్ళు. ఆ పెద్దవాళ్ళే ఈ విమల్- అమల్ - కమల్-
[ముగ్గురూ స్టేజినుంచి బయటకు వెళ్ళిపోతారు. బంధవిముక్తి పోందినట్లు.]

రచ: ఏవం ఇంద్రజిత్ !

[ఇంద్రజిత్ ఉలిక్కిపడి రచయితకేసి చూస్తాడు. తర్వాత- అమల్ మొదలైనవాళ్ళు వెళ్ళినవైపుకే వెళ్ళిపోతాడు. అతని చూపుల్లో బాధ, నడకలో అలసట కనిపిస్తుంది.]

రచ: బహుశా, వీరి జీవితాల్లో - నాటకాలు - దొరకవచ్చును. చిన్న చిన్న నాటకాలు- చిత్రమైన నాటకాలు- భవిష్యత్తులో ప్రతిభావంతుడైన నాటకీకారుడు. వీరి నాటకాలను రాయవచ్చు నేమో చెప్పలేము.

[పిన్ని ప్రవేశం]

పిన్ని:భోజానానికి వస్తావా ?రావా?

రచ: రాను!
[పిన్ని వెళ్ళిపోతుంది- మానసి ప్రవేశిస్తుంది]

మా :రాశావా?

రచ: లేదు.

[మానసి వెళ్ళిపోతుంది]
రచ: నేను ఎన్నో నాటకాలు రాశాను. ఇంకా ఎన్నో రాస్తాను. కాని-సామాన్య మానవుని కష్ట-సుఖాలు నాకు తెలియవు. పోలాంలో - హలాన్ని పట్టే కష్టజీవుల గాధలు నాకు తెలియవు. పాములవాడు - పల్లె కారు- గిరిజనుడు- వీరేవర్నీ నేను ఎరుగను. నా చుట్టూ ఉన్నవాళ్ళలో నాకు కథలు దొరకడంలేదు. ప్రత్యేకత కన్పించదు. వీరిదగ్గర నాటకాలను ఇతివృత్తం దొరకదు. అమల్ - విమల్ - కమల్ - ఇంద్రజిత్.
[స్టేజిమీద ఒక్కసారిగా చీకటి పరచుకొంటుంది.]

నేనే అమల్-విమల్ -కమల్ - ఇంద్రజిత్ - అందరూ నేనే.
[చీకట్లో గుసగుసలాడుతున్నట్టు స్వరం వినిపిస్తుంది.]

కంఠస్వరం____

అమల్ - విమల్ - కమల్ - ఏవం ఇంద్రజిత్-
అమల్ - విమల్ - కమల్ -ఏవం ఇంద్రజిత్-
విమల్ - కమల్ - ఏవం ఇంద్రజిత్-
కమల్ - ఏవం ఇంద్రజిత్-

ఏవం ఇంద్రజిత్-

ఇంద్రజిత్-

ఇంద్రజిత్-

ఇంద్రజిత్-

[వాద్యనాదాలతో-కంఠస్వరం కలసిపోతుంది. తీక్షణమైన వెలుతురు వస్తుంది. స్టేజినిండా -అందమైన నీడలు పడటం లేదు. స్టేజి ఖాళీగా వుంటుంది. ఆకస్మాత్తుగా ప్రారంభం అయిన వాద్యనాదం. అంతే ఆకస్మాత్తుగా ఆగిపోతుంది. కాలేజీగంట వినిపిస్తుంది.]

[ఇంద్రజిత్ ప్రవేశిస్తాడు. 35 సంవత్సరాల - ఆ యువకుడు మేకప్ లో వుండడు. పడకలో యువకత్వం కనిపిస్తుంది. ఆ వెనకే అమల్ ప్రవేశిస్తాడు. అతనిలో మాస్టారు ముఖంలో వుండే గాంభీర్యం ఉట్టిపడుతూ వుంటుంది. ఇప్పటినుంచి అమల్ - విమల్ - కమల్ - కీలుబొమ్మల్లా నడుస్తారు. అవసరానికి అనుకూలంగా భావ భంగిమలు చూపిస్తారు. అయినా యంత్రాలలా వుంటారు. నవ్వోస్తుంది. జాలిగూడా వేస్తుంది.]

అమల్: రోల్ నంబర్ థర్టీ ఫోన్ ?

ఇంద్ర: యస్ - సర్ !

అమల్:

Every body continues in its state of rest or-of uniform mition in a stright line un less it is compelled by an external impressed force to chang that state.

(గంట మ్రోగుతుంది. ఆయల్ - నిష్క్రమణ - ఇంద్రనిల్చొని వుంటాడు. విమల్ - ప్రవేసిస్తాడు.)

విమల్: రోల్ నెంబరు థర్టీఫోర్!

ఇం: యస్- సర్!

విమల్__

Poetry in general sence may for defined to for the expresston of imaginatiaon.

(గంట మ్రోగుతుంది. విమల్ నిష్క్రమిస్తాడు. కమల్-ప్రవేశము)

కమల్ : రోల్ నెంబరు థర్టీ ఫోర్.

ఇంద్ర: యస్-సర్!

కమల్: వ్యాసరచనకు ప్రధాన అంశాలు- తర్కం -భాష-భావ పరిపుష్టత- శృంఖలాబద్ధమైన ఆలోచనలు- తత్త్వం- అథ్యం- మొదలైన భావ సమ్మేళనం.

(గంట- కమల్ నిష్క్రమణ)

ఇంద్ర: తత్త్వం -తథ్యం - సమ్మేళన - తత్త్వం - తథ్యం- సమ్మేళన_____

Expression of imaginatiaon-
Expression of imaginatiaon-
State of rest or - of Uniform motion-
State of rest or - of Uniform motion-
State of rest or - of Uniform motion-
(గల గల మంటూ - కమల్ - విమల్ - అమల్ ప్రవేశం)

(ముగ్గురూ ఇంద్రను చుట్టివేస్తారు. ముగ్గురూ యీసారి నవయువకులుగా వుంటారు.)

అమల్ : ఆటగాడే గాడా? రెండు రన్నులో పోగానే ఆట గాడు గాకుండా పోతాడా?__

విమల్: అంటే చాలా గొప్ప ఆటగాడనా! నీ అభిప్రాయు! రెండో ఆటలోమాత్రం-ఏం-పొడిచేశాడేమిటి?-

కమల్: క్రికెట్ ! Gold of dlorius uncertanity అవునా ఇంద్ర!

ఇంద్ర: తప్పకుండా?

అమల్: అంటే- కౌశలం అనేది లేదంటావా? ఏం చెబుతున్నావయ్యా!

ఇంద్ర: కాదని ఎవరన్నారు?

విమల్ : ఏమన్నాఅను. ఫుట్ బాల్ మాత్రం ఎక్సయింటింగ్ గేం.

ఇంద్ర: అదీ నిజమే!

:కమల్: టెక్సాస్ మార్కు సినిమాకూడా- ఎక్సయింటింగ్ గానే వుంటుందిమరి. మంచి సినిమాలెందుకు చూస్తావ్?-

విమల్: అమల్ - నువ్వు యూత్  బర్నల్ ఫిలిం ఏమయినా చూశావా?____

అమల్ : దాదాపు అన్నీ చూశాను. బ్రహ్మాండంగా వుంటాయి. యూత్  బర్నర్  ముందు -  మార్లేన్ బ్రాండో ఎందుకూ పనికిరాడనుకో ఇంద్ర నీవు చూశావా?___

ఇంద్ర : చూశాను.

కమల్: ఏడ్చినట్టుంటాడు - వాడి గుండూ వాడూను!

అమల్ : గుండే! అయితేనేం? వాడి బుర్రకాయ అలాంటిది. గుండు కొట్టించుకొనే సాహసం -అందుకే, అతనికుంది.

విమల్ : బుర్రకాయ అలాంటిది అంటే మరో అర్ధం వస్తుంది బ్రదర్!

కమల్: అంటే ఆయిన్ స్టాయిన్ బుర్రలాగ!

ఇంద్ర: ఆయిన్ స్టాయిన్ పుస్తకం ఒకటి చదివాను. అసలు  అర్ధం  అయితేనా?-

అమల్: డైమన్ షన్సు నాలుగు  అన్నాడు. ఆయిన్స్టాన్.

విమల్ : నాలుగో  డైమెన్ షన్ టైం అన్నాడు కదూ!

కమల్: కాలేజీలో ఫిజిక్సు మింగుడు పడటంలేదు. పైగా  నాలుగో  డైమెన్ షన్ ఒకటి  మన ప్రాణానికి. అమల్ -  నీ ప్రాక్టికల్ బుక్ తయరయిందా?

అమల్ - మా అన్నయ్య బుక్ చూసి కాపీ చేసేస్తాను. ఆ( - ఎప్పుడు సబ్ మిట్  చెయ్యాలి ?

విమల్ :  పదమూడో  తారీఖులోపల. యింతవరకూ నేను మొదలుపెట్టనేలేదు. ఇంద్రా - నీ రథం  ఎంతదూరం కదిలింది?

ఇంద్ర : నిన్ననే ప్రారంభించాను. ఒక మంచిపుస్తకం దొరికింది.  కోర్సు పుస్తకాలు రెండు రోజులనుంచి ముట్టలేదు.

కమల్ : ఏం పుస్తకం?

ఇంద్ర:  బెర్నార్డ్ షా ! కంప్లీట్ ప్లేస్ !

అమల్ : బెర్నార్డుషా ! ఆహా! ఏం దంచేస్తున్నాడు.  నువ్వు- మాన్ -  అండ్ - సూపర్ మాన్ - చదివావా?

విమల్ : నేను ప్లేస్ అండ్ ప్లే లెట్సు మాత్రం చదివాను.

కమల్: మన  ప్రధమ్ బీసీకూడా ఇలాంటి ప్లేసే రాశాడు.

అమల్ : తగ్గు! ఎక్కడ జి. బిసి - ఎక్కడ ప్రధమ  బీ సీ !

విమల్: ప్రథం. బీ సి - పాలిటిక్సు ఇరికిస్తాడు.

కమల్ : అయితే ఏం? సాహిత్యంలో పాలిటిక్సు వుంటూనే వుంటాయి. ఆ మాటకొస్తే అవుసరం కూడా!

అమల్: నేను  ఒప్పుకొను. సాహిత్యం, - 'సత్యం - శివం సుందరం'కు ప్రతీక. చెత్త పాలిటిక్సు అందులోస్తావంలేదు.

విమల్ : చెత్త ! అంటూ తోసేయడానికి నేను అంగీకరించను. చెత్తకూడా సత్యమే. సత్యంనుంచి పారిపోవటాన్ని ఎస్ జేపిజం అంటాను. సాహిత్యం జీవిత ప్రతిబింబం. రియాలిస్టిక్ ఇంద్ర నీ అబిప్రాయం. ఏమిటి?-

ఇం : నాకంతగా తెలియదు. కాని _ ఒకటి -  సాహిత్య రియలిస్టిక్ గా, వుండాలనేది  నిజమే కానీ నగ్నసత్యాన్ని ప్రతిబింబించేదిగా......

కమల్: (వెంటనే అందుకోవలెను) అరె, అప్పుడే, ఏడున్నరయిందే!

అమల్ : మైగాడ్ ! ప్రాక్టికల్  బుక్కు తయారుచేయాలి. పదండి -పదండి!

విమల్ : మాత్రోన వేరు-

కమల్ : వెళ్దాం పద అమల్-
(అమల్ - కమల్ - నిష్క్రమిస్తారు.)

విమల్ : ఇంద్ర! ఇంటికి వెళ్ళవా?

ఇం: నాకు వేరే పనివుంది.

విమల్ : ఎక్కడి కెళ్ళాలి?

ఇం : అటు !

విమల్ : అటయితే వాళ్ళతో ఎందుకెళ్ళలేదు.

ఇం : అప్పడనుకోలేను.

విమల్ : తస్సాదియ్యా! నేను ఒక్కణ్ణే వెళ్ళాలి.
(విమల్ నిష్క్రమణ - ఇంతవరకు మందంగా మ్రోగుతున్న, తబలా వాద్యం ధ్వని పెద్దదవుతుంది.)

(రచయిత ప్రవేశిస్తాడు.)

రచ: ఇంద్ర ! నువ్వింకా ఇక్కడే వున్నావా?

ఇం: ఊఁ! (ఆలోచనలో వుండును.)

రచ: ఏమిటాలోచిస్తున్నావు?

ఇం:ఏమిలేదు.

రచ: వాళ్ళివాళ  రాలేదా?

ఇం: వచ్చి  వెళ్ళాను.

రచ: ఎవరెవరు?

ఇం: అమల్ - విమల్ - కమల్.

రచ: ఏం  చేశారు? మీరంతా చేరి?

ఇం: కబుర్లు చెప్పకున్నాము.

రచ: ఏం కబుర్లు?

ఇం: ఆ - ఏదో ఆ సంగతీ  - ఈ సంగతీ!

రచ: క్రికెట్ - సినిమా - ఫిజిక్సు - రాజనీతి - సాహిత్యం - అవునా?

ఇం: అరె! క్రికెట్ -సినిమా- ఫిజిక్సు- రాజనీతి-సాహిత్యం- ఇవన్నీ  నీకెలా తెలుసు?
(రచయిత  జవాబు  ఇవ్వదు.  జేబులోనుంచి  వేరుశనగకాయలు తీసి ఇస్తాడు.)

రచ:ఇంద! తిను!

ఇం: ఏం చెయ్యమంటావో చెప్పు?

రచ: ఏ విషయం?

ఇం : అదే! ఈ చదువు  నా వల్ల కావటం లేదు.

రచ: మరి ఇంకేం, చేస్తావు?

ఇం: అదే తెలియటంలేదు. అన్నీ వదిలేసి, ఎక్కడకైనా పారిపోవాలని అనిపిస్తుంది.

రచ: ఎక్కడికి  పారిపోవాలని?

ఇం : అదీ  తెలియదు. ఎక్కడుకో - దూరంగా  బహు దూరగా - అక్కడ  ఏముంటుందో కూడా తెలియని స్థలానికి - అరణ్యం -ఎడారి - మంచుకొండలు- పక్షులు- ఆస్ట్రిచ్ - జంతువులు- కంగారు - మనుష్యులు.

రచ: ఇంతేగదా! ఇదేమంత పెద్ద విషయం సరళభూగోళశాస్త్రం - డి.పి.ఐ. ద్వారా ఆరోక్లాసుకు పెట్టిన పుస్తకం-

ఇం : భూగోళానికి అవతలగూడా, మరో ప్రపంచం వుంది. ఆ ప్రపంచం ఇక్కడెక్కడాలేదు- దూరంగా - సుదూరంగా - ఈ ప్రపంచానికి అవతల ___

రచ: క్రికెట్ - సినిమా - ఫిజిక్సు - రాజనీతి - సాహిత్యం - వీటన్నిటికీ, దూరంగానా!

ఇం : అవును! వీటన్నిటికీ, దూరంగా!

రచ: అయితే పద!

ఇం: ఎక్కడికి?

రచ: అన్నీ వదలి పారిపోతావన్నావుగా?

ఇం: ఇప్పుడా ?

రచ: ఇంకెప్పుడు?

ఇం: నీతో చెప్పడం అంత బుద్ధితక్కువ మరొకటిలేదు.

రచ: నీ జేబులో డబ్బు ఎంతుంది?

ఇం: ఎనిమిదణాలు ఏం, ఎందుకు?

రచ: ణా జేబులో రూపాయి పావలా వుంది. రూపాయి పన్నెండణాలతో, హైదరాబాదు స్టేషన్ నుంచి, పోగలిగినంత దూరం వెళదాం. ఆ తరువాత పాదయాత్ర వుండనే వుంది!

ఇం: ఇలా ఎగతాళి చేస్తాననుకొంటే, నీతో మాట్లాడకపోదును.

రచ: నేను చాలా సీరియస్ గానే, మాట్లాడుతున్నాను.

(ఇంద్ర- రచయిత ముఖంలోకి చూస్తాడు. అతను నిజంగానే -సీరియస్ గానే కనిపిస్తాడు. ఇంద్రజిత్ సందిగ్దంలో పడిపోతాడు.)

ఇం: కాని-అమ్మ....

రచ:నిజమే, అమ్మ....

ఇం : పరిక్షలుగూడా దగ్గరకొచ్చాయి.

రచ:పరీక్షల తర్వాత మాట్లాడుదాంతే! ఇవిగో తీసుకో.
(అంటూ జేబులో నుంచి వేరు శనక్కాయలు తీసి యిచ్చి, వెళ్ళిపోతాడు.)

(నేపధ్యంలో పిన్ని కంఠం వినిపిస్తుంది)

"ఇంద్ర!"

ఇం: ఆఁ వస్తున్నా!
(ఇంద్ర కదలడు నిలుచునే వుంటాడు. పిన్ని ప్రవేశం)

పిన్ని : ఏరా! తిండి తినవా ఏమిటి? ఎంతసేపు వంటింట్లో కూర్చోమంటావు?

ఇం : అమ్మా !మరే....

రచ: ఆఁ, ఏమిటి?

ఇం: అమ్మా! నేను ఒకవేళ - ఎక్కడికైనా వెళ్ళాల్సి వస్తే....

పిన్ని : పిచ్చిసన్యాసి. పద భోజనం ఆరిపోతుంది.
(పిన్ని వెళ్ళిపోతుంది. నేపథ్యంలో -సంగీతం-సన్నగా ప్రారంభించి- పెద్దగా వినిపిస్తుంది. పిన్ని వెళ్ళినవైపుకే ఇంద్రా వెళతాడు.)

పాట:

ఒకటి-రెండూ-మూడు.
ఒకటి-రెండూ-మూడు = ఒకటి-రెండూ-మూడు-

(రండు సార్లు)

నాలుగు - అయిదు - ఆరూ-
నాలుగు - అయిదు -ఆరు =ఐదు - నాలుగు - ఆరు-

(రెండు సార్లు)

ఏడు - ఎనిమిది - తొమ్మిదీ-
ఏడు - ఎనిమిది- తొమ్మిది = ఎనిమిది -ఏడు-
ఎనిమిది-తొమ్మిది-

తొమ్మిది-ఎనిమిది-ఏడు- ఆరు-ఐదు-
నాలుగు - మూడు - రెండు - ఒకటీ-

(పాట వినిపిస్తుండగానే- రచయిత ప్రవేశిస్తాడు- పాట చివరపదంలో -కంఠం కలిపి పాడతాడు. స్టేజి ముందు ముందుకు వచ్చి నిలుచుంటాడు.)

రచ: లాభంలేదు. వీళ్ళ గురించి నాటకం రాయటం సాధ్యం కాదు. అసలు వీళ్ళను గురించి రాయటానికి, ఏమీ లేందె!

అమల్ - విమల్ - కమల్....
(గలగలలాడుతూ ముగ్గురూ వచ్చి రచయితను చుట్టేస్తారు.)

అమల్ : ఏమయ్యా! కవికుమారా! ఎలా వున్నావ్ ?

రచ: బాగానే వున్నా!

విమల్ : కొత్తగా, ఎం రాశావు?

రచ: ప్రత్యేకంగా - ఏం రాయలేదు.

కమల్: ఎందుకు బ్రదర్ ! భయపడతావు? మేము కానీ కొట్టంలే! అది గూడా మాకు చేతకాదు భయపడకు.

(ముగ్గురూ పెద్దగా నవ్వుతారు.)

రచ: ఒక చిన్న కవిత మాత్రం -రాశాను.

అమల్ : ఏదీ, అలా బయటకు, వినిపించు !

విమల్ : హే ! కవిశిరోమణీ! నీ కావ్యాకాకృతిని వినిపించుము?

కమల్: నీ కవిత్వం మాకు  అర్థం  అయిందనుకో- చింపిపారేయ్. అర్థం కాకపోతే ఏదైనా పత్రికకు-పంపించు.

(ముగ్గురూ పెద్దగా నవ్వుతారు.)

రచ: వింటారా?

అమల్, విమల్, కమల:- (ఒక్కసారిగా)

ఆ - ఆ - ఆ -తప్పకుండా!

(కవి - కవితా గానం ప్రారంభించుతాడు.)

రచ:ఒకటి-రెండూ-మూడు.
ఒకటి-రెండూ-మూడు +ఒకటి-రెండూ-మూడు
నాలుగు-అయిదు-ఆరు.
నాలుగు-అయిదు-ఆరు
ఏడు-ఎనిమిది-తొమ్మిదీ.
ఏడు-ఎనిమిది-తొమ్మిది=ఎనిమిది-ఏడుఎనిమిది -తొమ్మిది-

అమల్ : తర్వాత?

రచ:తొమ్మిది-ఎనిమిది-ఏడు-ఆరు-అయిదు-నాలుగు-మూడు-రెండు-ఒకటీ-

విమల్: వినిపించు !వినిపించు ! ఇంకా!

రచ: అయిపోయింది.

కమల్: ఇంతేనా?

రచ: ఇంతే.

(ఆశ్చర్యంగా కొంచెం వుండి - తర్వత -అంతా పక్కున నవ్వుతారు.)

అమల్ : ఆహ ! ఎంత మధుర కవిత్వం!

విమల్: అవును బ్రదర్ ! కలికాలంలో, బలిమి చాలావుంది!

రచ: అర్థం అయిందా?

కమల్ : లేఖ్ఖలక్లాసులో అయితే అర్థం అయేది. ఇది  కవిత్వం కదా! అర్థం కాలేదు.

(ముగ్గురూ- అట్టహాసం చేస్తారు.)

రచ: నాటకం రాయాలనుకొంటున్నాను.

అమల్: హఠాత్తుగా కవిత్వాన్ని వదిలేసి, నాటకం రాస్తావా?

రచ: హఠాత్తుగా కాదు, చాలాకాలంగా అనుకొంటున్నాను.

విమల్: రాసిపారేయ్ !రాసిపారేయ్ ! విశ్వాన్ని కూడా కలుపుకో!

కమల్: విశ్వం కొంచెం తలతిక్కగాడు. ఫోర్తుయియర్ లో వున్నాడు- నీకు తెలుసా? చాలా మంచి నాటకం రాశాడు. కాని అది అతనికే నచ్చలేదు. డ్రమెటిక్ క్లయిమాక్సు, సరిగా కుదరకపోతే ఏం చేస్తావ్?

అమల్: ఏం, నాటకం ? సాంఘికమా?

రచ: సాంఘికం అంటే?

విమల్ : సాంఘికం అంటే - తెలియనివాడివి, నాటకం ఏం రాస్తావయ్యా?

కమల్ : సాంఘికం అంటే-నేటి యుగానికి సంబంధించింది. అంటే నీకూ నాకూ సంబంధించింది.

రచ:అవును !మనకు సంబంధించిందే రాస్తాను.

అమల్: ప్లాట్ - ఏమాలోచించావు?

రచ: ప్లాటూ లేదు.

విమల్: ఆయితే _థీం, ఏమిటో చెప్పు?

రచ: థీం! అదే మనల్ని గురించే.

కమల్ : మనం అంటే?

అమల్ : మనల్ని గురించే రాస్తావా? అయినా, నాటకం రాసినట్టే!

విమల్: మనలో నాటకానికి కావాల్సిన మసాలా ఏముంది?

కమల్: ఓ నాటక మహాశయా! మన నాటకంలో స్త్రీ పాత్ర వుండదే?

(ముగ్గురూ - నవ్వుతారు.)

అమల్ : అబద్ధం ఆడతావెందుకు కమల్! ఎదురింటి అమ్మాయి-నీ నాయికేగా?

విమల్ : అవును. నేను మార్చేపోయా! కథ ఎంతవరకు వచ్చింది?

కమల్: నా కిటికీ కావ్యం దూరం నుంచే రాస్తున్నానుకాని. అమల్ తక్కువ అనుకొంటున్నారా? పోయిన సంవత్సరం ఉత్సవాల్లో తిరుపతిలో ఏం జరిగిందో అడుగు.

విమల్ : ఏమోయ్ అమల్ ఏమిటి కథ?

అమల్: అబ్బే! అలాంటిదేమీ, లేదు.

కమల్ : చెప్పరా, నాయనా, దాస్తావెందుకు?

(ముగ్గురూ ఒక ప్రక్కగా జరిగి మాట్లాడు కుంటూవుంటారు. రచయిత దూరంనుంచే వింటూ వుంటాడు. మానసి ఒకవైపు నుంచి ప్రవేశించి రెండో వైపునుంచి వెళ్ళిపోతుంది. ముగ్గురూ ఆమెను చూస్తారు. అంతలోనే ముగ్గురూ, గుసగుసలు ప్రారంభిస్తారు, నవ్వుకొంటారు. మానసి మళ్ళా ప్రవేశిస్తుంది. ఈ సారి ఆమె యింకో అమ్మాయి పాత్రలో కనిపిస్తుంది. చేతిలో bag నడక అన్నీ భిన్నంగా వుంటాయి. మాళ్ళీ మూకాభినయం- నవ్వు - తిరిగి- అతి సాధారణమైన రూపంలో మానసి ప్రవేశం ఆయయికంగా కనిపిస్తూ ఈసారి ఇంద్రజిత్ గూడా వుంటాడు. అందరి కళ్ళల్లో-కుతూహలం, ఈర్ష్య-)

(ఈర్ష్య తొంగిచూస్తున్నాయి. మానసి, ఇంద్రమాట్లాడుకొంటూ వెళ్ళిపోతారు.)

అమల్ : చూశారా?

విమల్ : ఈ మధ్య ఇంద్ర మారటానికి కారణం ఇప్పుడు అర్ధమయింది.

కమల్: sinking, sinking, drinking water. ఓ కవి పుంగవా- తిలకించావా?

రచ: తిలకించాను.

అమల్: ఏమర్ధమయింది?

రచ: నాటకానికి స్త్రీ పాత్ర దొరికిందని.

విమల్: ఇంద్రను హీరోను - మమ్మల్ని - సిపాయిల్ని గా చిత్రించు.

కమల్: హీరోయిన్ ఎవరో, చెప్పగలవా?

అమల్: నాకేం తెలుసు! ఇంద్ర ఎప్పుడైనా చెప్పాడా?

విమల్ : గంభీరమైనవాడు.

కమల్:గంభీర్యంకాదు గర్వం. తనేదో గొప్పవాణ్ణి అనుకొంటున్నాడు. నేను యిలాంటి వాళ్ళలోగల నరనరం తెలుసుకోగలను.

అమల్ : కవీ! నువ్వేరుగుదువా?

రచ : ఎవర్నీ ?

అమల్ : నీ నాటకంలోని హీరోయిన్ని, మూడ్ లో పడిపోయావా ఏమిటి?

రచ : ఆమెపేరు మానసి.

కమల్ : చూశావా! కవికి తెలుసు. బహుశా ఇంద్ర పరిచయం చేసివుంటాడు.

రచ: కాదు.

అమల్ : ఏమయ్యా! కవీ! మమ్మల్ని బోల్తా కొట్టేస్తున్నావా?

రచ : నన్ను  నమ్ము. నేను ఆమెను మొదటిసారిగా ఇప్పుడే చూశాను.

విమల్ : సరేలే ! ఇంద్ర నీకేం చెప్పాడు, చెప్పుదూ!

రచ: నాకేం చెప్పలేదు.....

కమల్ : నమ్మమంటావ్ - ఆమెను మొదటిసారి చూశావు. ఇంద్ర యేమీ చెప్పలేదు. కానీ ఆమెపేరు మానసి అని, నీకు తెలుసు!

అమల్ : ఈ కవి జాతితో వచ్చిన చిక్కే యిదిరా బాబూ. కవి ఎప్పుడు కవిత్వం రాస్తాడో, ఎప్పుడు ఆరోహ్యమ్గా వుంటాడో ఆ భగవంతుడికే తెలుసు.

రచ: నాటకం పేరు ఏం పెట్టమంటారు?

విమల్ : మొదటే పేరు పెట్టాలా?

కమల్ : పేరు వుండాల్సింది మొదటేగా? నువ్వే చెప్పు నామకరణం చెయ్యటంలో, నేర్పరివిగా?

రచ: అమల్, విమల్, కమల్ ఇంద్రజిత్, మానసి అనే పేరు పెడదామనుకొంటున్నాను.

అమల్: అయ్యబాబో! అట్ట సరిపోతుందా?

విమల్: మమ్మల్నెందుకయ్యా లాగుతావు. మేము నీ నాటకంలో దృతసైనికులం మాత్రమే.

కమల్: నిజమే! "ఇంద్రజిత్ - మానసి" అనిపెట్టు ఇకపదండి టైం అయింది.

అమల్: ఎక్కడికి?

విమల్: కమల్! టీ, తాగిస్తావా?

కమల్: అలాగే, పదండి.

(ముగ్గురూ వెళ్ళిపోతారు.)

రచ:"ఇంద్రజిత్ - మానసి."

"ఇంద్రజిత్ - మానసి"

(ప్రేక్షకులనుద్దేశించి మాట్లాడుతాడు.)

మానసి-ఇంద్రజిత్ లను తీసుకొని అనేకదేశాల్లో అనేక యుగాలగా, నాటకాలు తాయబడినవని మీకు తెలుసు. పౌరాణికాలు, చారిత్రకాలు, సాంఘికాలు, సుఖాంత -దుఃఖాంత నాటకాలు ఎన్ని రూపాల్లో- ఎన్ని పేర్లతో - ఎన్ని అంతస్తుల్లో-ఇంద్రజిత్-మానసీలు జన్మించారో-ప్రేమించారో -చెప్పలేం. సంయోగ వియోగం - సుఖదుఃఖాలు-ఈర్ష్యాద్వేషాలు సాంఘిక ఒడుదుడుకుల్ని, చూపిస్తూ-వీళ్ళను గురించి ఎన్ని నాటకాలు రచించబడ్డాయో చెప్పలేం. ఇంద్రజిత్- మానసి వీరిద్దరి ప్రేమ, నాటకాలకు చిరంతనమైన ఇతివృత్తం.

"ఇంద్రజిత్"(అని పిలచును)
(ఇంద్రజిత్ ప్రవేశం.)

ఇం : ఏమయింది? ఎందుకలా, కేకలేస్తావ్?

(రచయిత నాటకం ధోరణిలో మాట్లాడిన తర్వాత- ఇంద్రజిత్ స్వరం తమాషాగా వినిపిస్తుంది. అయినా- రచయిత యింకా నాటక ఫక్కీలోనే మాట్లాడుతాడు.)

రచ : చెప్పు?

ఇం : ఏం చెప్పను?

రచ : నీ కథ చెప్పు. అతి పురాతనమైన నిత్యనూతనమైన నీకథ చెప్పు. మహాభారత యుగంనుండి ప్రారంభించు.

ఇం : కవిత్వంలో మాట్లాట్టం మానేసి, ఆ అడిగేదేదో సరిగ్గా అడుగు.

(రచయిత ఆవేశం-కొంత చల్లబడుతుంది.)

రచ : నువ్వు-నీ మానసిని గురించిన కథ-

ఇం : మానసీ! మానసి ఎవరు?

రచ : ఆ రోజు బజారులో ఒక అమ్మాయితో నీవు వెళ్ళలేదు.

ఇం : చూశావూ. అయినా, ఆ అమ్మాయి పేరు మానసి కాదే- ఆమె పేరు.....

రచ : ఆమె పేరు నాకు అక్కరలేదు. నేను ఆమెకు మానసి అని పేరు పెట్టాను.

ఇం : నువ్వు ఆ అమ్మాయికి పేరు పెట్టడం, ఏమిటి వాళ్ళమ్మా -నాన్నా -ఆ అమ్మాయికి.....

రచ : అమ్మా-నాన్నా -ఏ పేరు పెడితేనేంలే చెప్పు.

ఇం : ఏం చెప్పను?

రచ : మీ ఇద్దరిని గురించి. ఆమె నీకు ఏమవుతుంది?

ఇం : చెల్లెలు!

రచ : చెల్లెలా? (కొంచెం ఆగును)

ఇం : అవును - మా పిన్నికూతురు.

రచ : పిన్ని కూతురా ? ఎందుకూ ?

ఇం : ఎందుకేమిటి? ఆమె తల్లి నాకు పిన్ని గనుక!

రచ : అలా కావటానికి వీల్లేదు. అయితే నీతో ఎందుకు వుంది ?

ఇం : మా ఇంటికి వచ్చింది. ఆమెను పంపటానికి బయలుదేరాను. ఎప్పుడూ నేనే పంపిస్తాను.

రచ : అయితే...అయితే...ఆమెపేరు మానసి కాదంటావు.

ఇం : చెప్పానుగా - కాదని.

రచ : మీ ఇద్దరూ ఏదో మాట్లాడుకుంటున్నట్లు అనిపించింది.

ఇం : అవును, మాట్లాడుకొంటూనే వున్నాం.

రచ : చాలా ఆత్మీయతతో మాట్లాడుతున్నట్లు చూశాను.

ఇం : (నవ్వుతూ) మీకలా - అనిపించిందా ? కావచ్చు. ఆమెతో మాట్లాడటం నాకు చాలా ఇష్టం.

రచ : ఆమెతో మాట్లాట్టం చాలా ఇష్టమా? కారణం-

ఇం : ఎందుకిష్టం అంటే ఎలా చెప్పడం? బహుశా రోజంతా మాట్లాడే మాటలకు - ఆమెతో మాట్లాడే మాటలకు భేదం వుండటం వల్ల కావచ్చు - బహుశా___

రచ : క్రికెట్ - రాజనీతి -సాహిత్యం -గురించి మాటలు కాదనుకుంటా.

ఇం : కాదు.

రచ : మరి ఏ విషయాలు?

ఇం : ఎన్నోవిషయాలు, నేను - నా గురించి నా స్నేహితుల గురించి మాట్లాడతాను. ఆమె తన కుటుంబ విషయాలు- కాలేజీ విషయాలు - స్నేహితురాండ్ర విషయాలు ఎన్నో మాట్లాడుతుంది.

రచ : ఇంకా?

ఇం : ఇంకా ఏమిటి? నీతో మాట్లాడతాను!

రచ : క్రికెట్ - సినిమా - రాజనీతి-

ఇం : అవే కాదు. ఇంకా ఎన్నో మాట్లాడుకుంటాం. నీ రచనల గురించి-తెలిసిన వ్యక్తులగురించి- భవిష్యత్తుగురించి ఇలా ఎన్నో విషయాలుంటాయి.

రచ : అవును కంగారు - ఎక్సిమో మొదలయిన వాటికి సంబంధించిన విషయాలు.

ఇం : ఇవన్నీ నేను అందరితో మాట్లాడలేదుగా.

రచ : మానసితో మాట్లాగలవుగా?

ఇం : ఆమె పేరు.

రచ : నాకు తెలుసు. ఆమె పేరు మానసి కాదు. నేను ఆమెను మానసి అంటే నీకేమైనా అభ్యంతరమా?

ఇం : (నవ్వి) అభ్యంతరం ఎందుకు? పైగా మానసి అనే పేరు బాగుందికూడా. ఆమె అసలు పేరులో ఇంత అన్యత్వం లేదు.

రచ : అయితే చెప్పు.

ఇం : ఏం చెప్పను?

రచ : నాతో మాట్లాడే విషయాలన్ని ఆమెతో మాట్లాడగలవా?

ఇం : గలను. అన్ని విషయాలు ఎప్పుడో చెప్పేశా- నీతో మాట్లడలేనివి ఎన్నో ఆమెతో మాట్లాడగలను.

రచ : నాతో  మాట్లాడలేనివా?

ఇం : మాట్లడలేనివని కాదు....మాట్లాడలేదు. ఎన్నో విషయాలు మాట్లాడుకొంటాం. కొన్ని  ముఖ్యమైనవి, కొన్ని అతిసాధారణమైనవి....కాని, ప్రత్యేకంగా చెప్పటానికి ఏమీలేవు.

రచ : మానసి నీ  స్నేహితురాలా?

ఇం :  స్నేహితురాలా? కావచ్చు. ఆమెతో మాట్లాట్టం నాకు ఎంతో ఇష్టం. ఆమెతో  మాట్లాడితే, మనస్సు  తేలికగా వుంటుంది. రోజులు (అకస్మాత్తుగా రచయితను చూస్తూ) నీకు అనిపించదూ?

రచ : ఏమని?

ఇం : రోజులు నిరర్ధకంగా గడచిపోతున్నాయని ఒక మహాచక్రం గిరగిర తిరుగుతుందనీ దాంతో పాటు మనమూ తిరుగుతున్నామని ఆనిపించదు.

రచ : ఒకటీ - రెండు - మూడు-
ఒకటీ-రెండు - మూడు- ఒకటి.

ఇం : ఏమంటున్నావ్?
(అంతలో వాద్యనాదం వినిపిస్తుంది. అమల్- ప్రొఫెసర్ రూపంలో ప్రవేశిస్తాడు.)

అమల్ :రోల్ నంబరు థర్టీ ఫోర్.

ఇం : యస్ -సర్.

అమల్ : what ik the specific gravity of iron.

ఇం : Eleven point seven sir (11.7)
(గంట-అమల్ వెళ్ళిపోవటం-విమల్ ప్రవేశం)

విమల్ : రోల్  నంబర్ థర్టీఫోర్.

ఇం : యస్ - సర్.

విమల్ : who was Mazzini ?

ఇం : One of the founder of italy.
(గంట-మ్రోగుతుంది. విమల్ వెళ్ళిపోతాడు. కమల ప్రవేశిస్తాడు.)

కమల్ : రోల్ నంబరు థర్టీ ఫోర్.

ఇం : యస్ - సర్.

కమల్ : భారతీయుల వైరాగ్యభావం యొక్క ప్రభావం ప్రాచీన సాహిత్యం మీద ఎంతవరకు పడింది?

ఇం : భారతీయ సాహిత్యంలో కన్పించే అనవసర ప్రసంగాలన్నీ- భారతీయుల వైరాగ్యానికి ప్రతీకలు. అనవసర వర్ణనలు - తత్వచింతన- అర్థంలేని పిట్టకథలు - ఇవన్నీ సాహిత్య ప్రవాహానికి అడ్డంకులే.

[కమల్ మధ్యలోనే వెళ్ళిపోతాడు. వాద్యనాదంలో ఇంద్రజిత్ కంఠం వినిపిస్తూ వుంటుంది. యువకుడుగా- అమల్ ప్రవేశం.]

అమల్ : ఇంద్రా! నా ప్రాక్సీ ఇచ్చేయ్. నేను సినిమాకు వెళ్ళాలి.

ఇం : అలాగే.

(అమల్ నిష్క్రమిస్తాడు. విమల్ ప్రవేశం.)

విమల్ : శనివారం నీ కెమిస్ట్రీ నోట్సు యిస్తావా ఇంద్రా-?

ఇం : అలాగే, తీసుకో.
[విమల్ నిష్క్రమణ - కమల్ ప్రవేశం.]

కమల్ : నీ దగ్గర ఒక రూపాయివుందా? మళ్ళీ సోమవారం ఇచ్చేస్తాను.

ఇం : ఇవ్వాళలేదు. కావాలంటే రేపు ఇస్తాను.
[కమల్ వెళ్ళిపోతాడు-పిన్ని వస్తుంది]

పిన్ని : భోజనం వడ్డించనా ?

ఇం : కాసేపు ఉండమ్మా.

పిన్ని : ఇంకెంతసేపు ఎదురుచూడమంటావురా. తేనేస్తే పని తీరిపోతుందిగా/
[పిన్ని వెళ్ళిపోతుంది. వాద్యసంగీతం పెద్దగా వినిపిస్తుంది.]
[తొమ్మిది-ఎనిమిది-ఏడు-ఆరు-ఐదు-నాలుగు-మూడు రెండు-ఒకటి. ఆగిపోతుంది సంగీతం.]

ఇం : మనం అందరం గిర్రున తిరుగుతున్నాం -తిరిగి పోతున్నాం.

పిన్ని : (నేపథ్యంలోనుంచి) "ఇంద్రా!"

ఇం : ఆఁ వస్తున్నానమ్మా!
[ఇంద్ర నిష్క్రమణ -పిన్ని ప్రవేశం.]

పిన్ని : నువ్వు భోంచెయ్యవు?

రచ : చెయ్యను.
[పిన్ని వెళుతుంది-మానసి ప్రవేశం.]

మానసి : రాశావా కవీ ?

రచ : లేదు.

(మానసి వెళ్ళిపోతుంది)

రచ : ఒకటి - రెండు - మూడు. అమల్ - విమల్ - ఏవం- ఇంద్రజిత్ - ఏవం - మనసి - ఇంటినుండి స్కూలుకు- స్కూకునుండి కాలేజీకి. కాలేజీనుండి ప్రపంచానికి- అందరూ పెద్దవాళ్ళవుతున్నారు. తిరుగుతున్నారు. ఒకటి - రెండు - మూడు- రెండు- ఒకటి- అమల్ - విమల్- కమల్ - ఏవం ఇంద్రజిత్.

(అమల్ -విమల్ -కమల్ -ఇంద్రజిత్ వచ్చి పరీక్ష రాయటానికి వచ్చి కూర్చుంటారు. స్టూలు- టేబుల్ -ప్రశ్న పేపరు - కాపీ - రచయిత తీచరులా తిరిగి తిరిగి వాచ్ చేస్తుంటాడు.)

రచ : (కొంచెం ఆగి)
Time up stop writing please.
(వారు త్వరత్వరగా -రాస్తుంటారు. రచయిత ఒక్కొక్కరి దగ్గర పేపర్ల తీసుకొంటూ వుంటాడు. వాళ్ళు పరీక్షపేపర్ల గురించి మాట్లాడుకొంటూ నిరాశగా- భయంగా వెళతారు.)

రచ : స్కూలునుండి కాలేజికి-

కాలేజి-పరీక్ష -పరీక్షప్యాస్ - మళ్ళీ ప్రపంచం.
(అమల్ -విమల్ -కమల్ -ఇంద్రజిత్-ప్రవేశం)

అమల్ : ప్యాసయాక, ఏం చేస్తావ్?

విమల్ : ముందు ప్యాసవనీ.

కమల్ : ప్యాసయినా , ఫేలయినా, నేను ఉద్యోగం చెయ్యాల్సిందే. నాన్నగారు ఈ సంవత్సరం రిటైరు అవుతున్నారు.

విమల్ : నీకేమయ్యా! నేను ముగ్గురు చెల్లెళ్ళకు పెళ్ళిళ్ళు చేయాలి.

కమల్ : ఇంతవరకు నిశ్చింతగా తిరిగాను. పరీక్ష ఫలితాలు తెలిసే రోజులు దగ్గరపాడుతుంటే, నాకు ముద్ద మింగుడు పడటం లేదు.

రచ : అమల్ కుమార్ !
(అమల్ సంతోషంతో కెవ్వుమంటాడు. అందరూ వీపు తట్టి, అభినందిస్తారు.)

విమల్ కుమార్.
(పైలాగే జరుగుతుంది)

కమల్ - ఇంద్రజిత్.

(ఒకరినొకరు అభినందించుకొంటారు. పిన్ని వస్తుంది. అందరూ పాదాభివందనం చేస్తారు. ఆమె దీవిస్తుంది. వెళ్ళిపోతుంది. నలుగురూ వెళతారు.)

రచ : ఇది మరోప్రపంచం. ఈసారి విద్యాదికులు ఈకుర్చీలో కూర్చొని పరీక్ష ఇస్తారు. బయట వేసివున్న బల్లమీద అమల్ , విమల్, కమల్, ఇంద్రజిత కూర్చొని వుంటారు.

(అమల్ , విమల్, కమల్, లోపలకువచ్చి బెంచీమీద కూర్చోబోతారు.)

కొంచెం వుండండి. ఒక్కనిమిషం.

(ముగ్గురూ వెళ్ళిపోతారు)

రచ : మర్చి పోయారు చెప్పటం. ఆ కుర్చీలు అక్కడలేవు, బెంచీల సంగతికూడా మార్చిపోండి. ఇక్కడ పచ్చని గడ్డివుంది. ఇవన్నీ చెట్లు. ఆ చెట్టు పై భాగంలో సింధూరరేఖ కనిపిస్తుంది. రోజూ ఉదయించే సూర్యుడు ఇవ్వాళా ఉదయించాడు. ఇప్పుడస్తమిస్తున్నాడు.

అదిగో, అటు, ఎంత చిక్కని సింధూరరేఖ కనిపిస్తుందో చూడండి.

(అదే సమయంలో, మానసి, ఇంద్రజిత్ ప్రవేశిస్తారు ఇద్దరూ చెట్టుక్రింద నిలుచుంటారు. మానసి చేతిలో ఒక పుస్తకంవుంది. రచయిత సిందూరరేఖ చూట్టంలో నిమగ్నుడై వుంటాడు.)

మానసి : నువ్వునాకు ఈపుస్తకం ఎందుకిచ్చావ్? న్యాయంగా నేను నీకు యివ్వాలి.

ఇంద్ర : ఎందుకు?

మానసి : ఎందుకేమిటి? నువ్వు ప్యాసయినందుకు.

ఇంద్ర : నేను ప్యాసయితే నువ్వు పుస్తకం యివ్వాలని ఎక్కడయినా రాసిపెట్టివుందా? నేనే ఎందుకివ్వ కూడదు?

మానసి : రాసిపెట్టి వుండాలా? అది పద్ధతి.

ఇంద్ర :పద్దతులమీద నమ్మకం వుందా ?

మానసి : (నవ్వుతూ) వుందంటే నువ్వూరుకుంటావా ?

ఇంద్ర :నా నమ్మకాలను ఒప్పుకొంటావా?

మానసి : ఆడపిల్లలు ఒప్పుకొక చేసేదేముంది?

ఇంద్ర : ఆడపిల్లలు - ఈ మాట ఎన్నోసార్లు అన్నావు. ఆడపిల్లలు - నియమాలను పాటించాలి. మగవాళ్ళు పాటించకపోయినా, ఫర్వాలేదు. అవునా?

మానసి : నేను నిజమే అంటున్నాను.

ఇంద్ర : నేను కూడా నియమాన్ని పాటిస్తాను. చదవాలన్నారు. చదివాను. పరీక్ష ఇవ్వాలన్నారు - ఇచ్చాను, ఉద్యోగం చెయ్యాలంటున్నారు -చేస్తాను. మరి ఇదంతా నియమపాలన కాదూ? ఒకటి-నియమం లేక పోయినా ఉద్యోగం చేస్తాను.

మానసి : ఎందుకు?

ఇంద్ర : అనేక కారణాలు. నా కాళ్ళమీద నేను నిలబడాలి. ఇంటివాళ్ళ డబ్బుతో నేను చదువుకోవడం అంటే నాకు ఎలా వుంటుందో నీకు చెప్పాను.

మానసి : ఇంకా!

ఇంద్ర : చాలా వున్నాయి. నువ్వొక సంగతి చెప్పు?

మానసి : ఏమిటది!

ఇంద్ర : నియమాలను పాటించాలి అనే వాక్కునుకూడా పాటించాలా?

మానసి : పాటించక ఏం చేస్తావ్ ?

ఇంద్ర : నియమాలను అసహ్యించు కొంటాను, కనీసం, ఆ మాత్రం స్వంతంత్రత వుండొద్దు?

మానసీ : దానివల్ల ప్రయోజనం ?

ఇంద్ర : నన్ను కట్టేసిన తాడును పూజించటంలో ప్రయోజనం?

మానసీ : పూజించమని ఎవరంటున్నారు?

ఇంద్ర : తాడును, నియమంగా తీసుకొని స్వీకరించటానికీ, దాన్ని పూజించటానికీ భేదం ఏముంది?

మానసీ : ఇన్నిటికీ, నువ్వు చెయ్యదలచిందేదో చెప్పరాదు?

ఇంద్ర : నన్ను కట్టేసిన త్రాళ్ళను తేంపేస్తాను. నాచుట్టూ వున్న గోడల్ని పగలగోడతాను.

మా : కోపం, ఎవరిమీద ?

ఇం : ప్రపంచంమీద-మీరు గౌరవించే సంఘంమీద. నేను, నీతో ఒకసారి లీలను గురించి చెప్పాను. గుర్తుందా?

మా : ఆమె భర్తకు-టి.బి. అన్నావు కదూ?

ఇం : అతను చనిపోయి చాలారోజులయింది. ఆమెను - అత్తగారింటినుంచి తరిమేశారు.

మా : తర్వాత?

ఇం : ఎవరో దూరం బంధువట. అతనికి ఒక చిన్న దుకాణం వుంది. వాళ్ళంతా, దొంగతనాల కేసుల్లో చిక్కుకొని వున్నారట.

మా : ఆ - అమ్మాయి ఏమయింది?

ఇం : జరుగరానిదే జరిగింది. మూడు నెలలయిందట. నాకు నిన్ననే తెలిసింది.

(మానసి మౌనంగా వుండిపోయింది.)

ఇం : నేను రోజూ బస్సు ఎక్కే స్టాపులో ఒకరోజుఒక కుర్రాడు - బూట్ పాలిష్ చేస్తానని నన్ను పట్టుకొన్నాడు. వాడికేడెనిమిది యేళ్ళుంటాయి. వాడిచంకలో సంవత్సరం పిల్లవాడు పాలిష్ తో మునిగి వున్న గుడ్డపీలికతో

ఆడుకుంటున్నాడు.
(మానసి మౌనంగానే వుండి వింటూంది.)

ఇం : నేను, పాలిష్ చేయించుకోలేదు. ఒక్క పైసగూడాయివ్వలేదు. విదిలించికొట్టాను. నన్ను వాడు విసిగించి వుంటే, బహుశా, కొట్టేవాణ్ని కూడా నేమో!

మా : ఎందుకు ?

ఇం : నాకే తెలియదు. ఎవర్ని కొట్టాలో -నాకు తెలియడం లేదు. వాణ్ని కొట్టకూడదని నాకు తెలుసు. అయినా కొట్టే వుండేవాణ్ని. బహుశా ఏడెనిమిది యేళ్ళ పిల్లవాడిచేత బూట్ పాలిష్ . పనిచేయిస్తూ, వాటినెత్తిన మరొక పసివాడి బరువు గూడా ఎత్తిన ఈ నియమాలను నేను పాటించలేక కావచ్చును.

మా : ఇది వేరు.

ఇం : వేరు ఎలా అవుతుంది. నీ యింట్లో నియమాలు మరో రూపంలో వుంటాయి. వాటిని నువ్వు పాటిస్తావు. పాటించాలని గూడా నీ నియమాలలో వుంది.

మా : నా మీద కోపం వస్తుంది కదూ?

ఇం : నీ మీద నాకు కోపం రాదనీ నీకు తెలుసు.
(మానసి మాట్లాడదు.)

ఏం : తెలియదా?

మా : తెలుసు.

ఇం : మరి నిష్టూరంగా ఎందుకు మాట్లాడుతున్నావు.

మా : నిన్ను ఇలా చూస్తుంటే ఎందుకో నాకే భయం వేస్తుంది.

ఇం : ఎలా చూస్తుంటే?

మా : నీ కోపం - అదే, నియామాలంటే నీకున్న కోపం చూస్తుంటేను....

ఇం : (కొంచెం నవ్వి)____నా కోపం నిష్ప్రయోజనమైంది. ఈ కోపం గుడ్డిది. దోడకు తలకొట్టుకున్నట్లే - నేను కోపగించుకోవటం.

మా : తెలిసి గూడా, ఎందుకిలా నిన్ను - నువ్వు హింసించుకుంటావు?

ఇం : ఎప్పుడైనా బైబిలా చదివావా?

మా : బైబిలా ? ఎందుకు?

ఇం : జ్ఞానవృక్షాన్ని గురించిన కథ చదివావా? జ్ఞానఫలాన్ని -తిన్న- ఆదమ్, అవ్వ ఎలా స్వర్గచ్యుతులు అయ్యారో విన్నావా?

మా : విన్నాను.

ఇం : నేనుకూడా, జ్ఞానఫలం రుచి చూసి వుండకపోతే - నీ, ఈ సంఘవ్యవస్థలో స్వర్గసుఖాన్ని చూడుగలిగే వాణ్ని. గోడకు తల పగలకొట్టుకోవడంకంటే యిష్టం. నేను చేయగలిగింది ఏమీలేదు.

(కొంతసేపు యిద్దరూ మౌనంగా వుంటారు.)

మా : నువ్వు లేకపోతే, నేనేమౌతానో అనే భయం నాకు అప్పుడప్పుడూ, కలుగుతూ వుంటుంది.

ఇం : ఎందుకు?

మా : చెబుతాను. కోపగించుకోకు. నువ్వు లేకపోతే యీ నియమాలను చూసి నాకు కోపం వచ్చేది. నువ్వు వున్నావు గనుకనే నేను నియమాలను పాటిస్తున్నాను.

ఇం : అంటే నేను వుండటం నీకు హానికరం అన్నమాట

మా : అలా అనకు. ఎలా చెప్పను? నువ్వంటే నాకు ఎంత ఇదో ! నీ ఉనికి నా జీవితానికి శక్తి ఇస్తుంది. ఆ శక్తి నాకు లభించకపోతే యేనాడో నేను మునిగిపోయేదాన్ని.

(ఇంద్ర వింటూ వుంటాడు.)

నాకు కోపగించుకోవడం ఇష్టంలేదు. ఈ జీవితాన్ని నేను ప్రేమిస్తున్నాను. అందుకే జీవితంతో రాజీపడటానికి నేను వెనుకాడను. ఇదంతా నీవల్ల......... ఏమిటో నాకు సరిగా చెప్పటం రావటంలేదు____

ఇం : ఊఁ ! ఆగిపోయావేం ?మాట్లాడు.

మా : నాకు మాట్లాట్టం రాదు. నువ్వే , మరో  విషయం మాట్లాడు.

ఇం :  మనం మాట్లాడుతూంది అదేగా?

మా : ఈ పుస్తకం, నాకు అర్థం కాకపోతే చెబుతావు కదూ?

(ఇంద్ర మానసిని చూస్తూ నిలుచొని వుంటాడు.)
ఏమయింది-మాట్లాడవేం?

ఇం : నాకు ఉద్యోగం దొరికిన రెండోరోజు  నిన్ను పెండ్లి చేసుకొంటాను.

మా : వద్దు ! వద్దు !

ఇం : చూస్తుండు.

మా : నేను నీ పినతల్లి కూతుర్ని అన్న విషయం  మర్చిపోతున్నావే?

ఇం : నువ్వు ప్రతిసారి జ్ఞాపకం చేస్తూనే వున్నావుగా.

మా : అయినా, నువ్వు అదే అంటున్నావు.

ఇం : నిజమే అంటున్నాను. నేను దేన్ని లక్ష్యం చెయ్యను.

మా : నన్ను కూడానా?

ఇం : నువ్వు కావాలి. గాని-నీ నియమాలు నాకక్కరలేదు.

మా : నన్ను నీవు  ఎక్కువరోజులు భరించలేవు.

ఇం : ఇదొక వంక!

మా : నేను నిజమే చెబుతున్నాను. నేను అతిసాధారణమైన ఆడపిల్లను.

ఇం : నేను పూర్తిగా అసాధారణమైనవాణ్ని.

మా : అవును. నువ్వు అసాధారణమైనవాడివే.

ఇం : సంతోషిస్తున్నాను.

మా : కాదులే ! సాధారణమైనవాడివే.

ఇం : ఇక పేచీ ఏముంది?

మా : అయిపోయిందా?

ఇం : ఒక సాధారణమైన అబ్బాయి, ఒక సాధారణమైన అమ్మాయిని. వివాహం చేసుకోబోతున్నాడు. ఇక గొడవే లేదు.

మా : ఇక చాల్లే ! వెళదాం పద!

ఇం : నేను రాను.

మా : ఆలస్యం కావటంలేదు.

ఇం : కానీయ్.

మా : నీకేం ? నీ మూలంగా నేనేగా ఇంట్లో తిట్లు తినాలి.

ఇం : అది ఇల్లుకాదు. వల్లకాడు.

మా : మళ్ళీ ప్రారంభం. పద వెళదాం!

ఇం : పద!

మా : ఎందుకంత కోపం? నాకేం భయం అనుకున్నావా?

ఇం : ఆలశ్యం అవుతుంది. కదులు-

మా : నేను  కదల్ను.

ఇం : అయితే సరే! కూర్చుందాం!

మా : ఏయ్ ! లే లే  వెళదాం.

(ఇంద్ర మానసి  భుజంమీద చెయ్యి వేస్తాడు. మానసి చెయ్యిని తోసేస్తుంది.)

ఏమిటిది? పార్కులో వున్నాం అన్న సంగతి మార్చిపోయావా?

ఇం : అయితే ఏం?

మా : అదుగో - అటు చూడు! ఆ చెట్టుక్రింద ఎవరో వున్నారు.

[రచయిత చీకట్లో ఓప్రక్కగా కూర్చుంటాడు.]

ఇం : ఉండనియ్ !

మా : అతను చూస్తే ?

ఇం : చూడనియ్ ! బాగా చూడమను.

{మళ్ళీ ఇంద్ర మానసి భుజంమీద చెయ్యి వేస్తాడు. మానసి చేతిని తొలగించింది. ముందుకు నడుస్తుంది. చిరునవ్వుతో ఇంద్రజిత్ ఆమెను అనుసరిస్తాడు. రచయిత ముందుకొస్తాడు.]

రచ : ఇంద్రజిత్ -మానసి తిరిగి తిరిగి వాళ్ళు చాలాదూరం చేరుకున్నారు. చాలాదూరం! చాలాదూరం వెళ్ళి పోయారు. వివాహం చేసుకుంటారు. మళ్ళీ అదే చక్రంలో యిరుక్కుంటారు. ఒకటి, రెండు, మూడు - మూడు, రెండు, ఒకటి. ఇదో పెద్ద పాషన. పూర్ణ ప్రశ్న. దానికి జవాబు శూన్యం. అందుకే లెక్కల్లో పూర్ణం వర్జించి, వేరు వేరుగా తీసుకుంటారు. జవాబు జీవితం యిస్తుంది. ప్రతి జీవితం వేరు. వేరు జవాబుల్ని యిస్తుంది.

దిక్ చతుష్టయం చూస్తూనే వుంది

నియమబద్ధంగా

అనంతమైన ఆట

నడుస్తూనే వుంది అనాదిగా.

అంధకార ఆలింగనంలో ఆబద్ధ ప్రకాశం

సమయపు రక్తిమధ్వని

కాలంలో ప్రతిధ్వినించింది

దివారాత్రుళ్ళు ఖండఖండంగా

ఏ సూత్రంలో బంధించబడ్డాయి.

భూత భావిష్యత్తుల్ని అన్వేషిస్తూ

తెలియని దిక్కుల్లో ప్రయాణం

నేనే వర్తమానాన్ని-నాకు అన్వేషణ లేదు.

సూక్ష్మమీనమేషాల్లో ఏం లభిస్తుంది?

ఈ ప్రశ్నలకు సమాధానం

కాదు అసంభవం

స్వప్నాల వాయుతంత్రులతో

ఆగంతకునికి వస్త్రం నేస్తే ప్రయోజనం!

దివారాత్రుల మధుర పదధ్వనికి

అనవరతంగా పడుతున్న తాళం

ఎందుకు పెంచుకుంటావు?

ప్రశ్నల్ని మనో మందిరంలో

కాలం వేస్తున్న తాళంతో బంధించు హృదయస్పందనను

అందుకో భవిష్యత్తు యిచ్చిన ప్రసాదం-
(అమల్, విమల్, కమల్, ప్రవేశిస్తారు.)

రచ : ఆగు! ఇంకా సమయం మించిపోలేదు.

(ముగ్గురూ వెళ్ళిపోతారు.)

ఒక్కక్షణం మాత్రమే! ఈ క్షణం యిచ్చిన దాన్ని స్వీకరించు. అంటే ఎదురైన సమస్యను సంపూర్ణంగా స్వీకరించు. ఒక్కక్షణం- వర్తమానంలోని ఒక్కక్షణం- అదే జీవితం - అయినా అమాయక హృదయం దీన్ని స్వీకరించదు. నిరంతరం లెక్కల బరువును మోస్తూనే వుంటుంది. దుస్సాధ్యమైన ప్రశ్నలకు సమాధానం వెతకటానికి ప్రయత్నించదు.

జవాబు అనంతమైన శూన్యం అని ఎలా అంగీకరించను? మౌనంగా కూర్చొని అల్పమైన రోజుల్ని లెక్కించుకుంటున్నాను ప్రకృతిలోని ప్రతి పత్రం మీద శిశువు అక్షరాల్లో క్షణక్షణం జీవితభాష మిగిలిపోతూనే వుంది.

[కవితా పాఠంతో పాటు రచయిత మీద పడుతున్న వెలుగు తగ్గిపోతుంది. వెనుక టేబులూ, కుర్చీలు- వాకిలి దగ్గరగా

బెంచి- అమల్, విమల్ కమల్, ఇంద్రజిత్ బెంచీమీద కూర్చొని వుంటారు. టిఫ్ టాఫ్ గా ముస్తాబయి గంభీరంగా కూర్చుని వుంటారు. గంటమోగుతుంది. అమల్ లేచి టేబుల్ దగ్గరకు వెళ్ళి అదృశ్యవ్యక్తులకు నమస్కరించి కుర్చీలో కూర్చుంటా మౌనంగానే ప్రశ్నలకు సమాధానాలు ఇస్తుంటాడు. బెంచిమీద కూర్చున్నవాళ్ళు మాట్లాడుకుంటూ వుంటారు.]

విమల్ : క్యాబినెట్ మినిస్టర్ల పేర్లు జ్ఞాపకమున్నాయా?

కమల్ : లేదు. అవన్నీ చదవలేదు.

విమల్ : ఇయర్ బుక్ తెచ్చుకొంటే బాగుండేది.

కమల్ : ఏంబాగు? ఎన్నని వల్లిస్తాం !

విమల్ : టైం ఎంతయింది ఇంద్రా !

ఇంద్ర : పన్నెండు యిరవై !

కమల్ : పదకొండుకల్లా మనల్ని రమ్మనారు. బాబుగార్లు పన్నెండుకు వచ్చారు ఇంటర్వ్యూ చెయ్యటానికి.

విమల్ : ఇదంతా ఒక ఫార్స్ ! ఉద్యోగం ఎవరికివ్వాలో ముందే నిర్ణయం జరిగి వుంటుంది.

కమల్ : ఎవరైవుంటారు ? అమల్ కంటే ముందు వెళ్ళిన వాడేనా?

విమల్ : తెలియదు. కాని మనం మాత్రం కాదు.

కమల్ : అమల్ వెళ్ళి ఎంతసేపయింది ?

ఇంద్ర : ఐదు నిముషాలు.

విమల్ : ఏం అడుగుతున్నారో?
(అమల్ లేస్తాడు. దర్వాజాదగ్గరకు రాబోయి మరో వైపునుంచి బయటకు వెళ్ళిపోతాడు.)

కమల్ : టెక్నికల్ ప్రశ్నలు వేస్తారేమో?

విమల్ : అదేంకాదు. జవాబులకంటే జవాబులిచ్చే తీరు తెన్నులు చూస్తారు.

కమల్ : అవును. జవాబు తెలియకపోతే స్మార్టుగా చెప్పడం చాలా కష్టం.

[గంట విమల్ లోపలకు వెళతాడు. వీళ్ళిద్దరూ బెంచి మీద, దగ్గరకు జరిగి కూర్చుంటారు విమల్ అమల్ లాగే మూకాభినయం చేస్తాడు.]

కమల్ : గొంతు పూడిపోతుంది. నీ దగ్గర లవంగం వుందా?

ఇంద్ర : లేదు.

(కమల్ సిగరెట్టు తీస్తాడు.)

గోంతు బాగాలేదని సిగరెట్ తాగుతావేం?

కమల్ : మంచిది కాదనుకుంటా ! (సిగరెట్ పెట్టేస్తాడు.)

ఇంతకు ముందెప్పుడైనా ఇంటర్వ్యూకు వెళ్ళావా ?

ఇంద్ర : ఐదుసార్లు.

కమల్ : నేను నాలుగుసార్లు వెళ్ళాను. ఎప్పుడైనా నీకు వాళ్ళనుంచి ఏమైనా కబురువచ్చిందా ?

ఇంద్ర : వచ్చింది. ఒకమాత్రం రిగ్రెటింగ్ లెటర్ పంపారు.

కమల్ : (ఆలోచించి) వచ్చేనెల్లో మానాన్న రిటైరు అవుతున్నాడు.

(ఇంద్రజిత్ జవాబివ్వడు. రచయిత ప్రవేశిస్తాడు. చిరునవ్వుతో ఇంద్రజిత్ పక్కనే కూర్చుంటాడు. కొంచెంసేపు అందరూ మౌనంగా వుంటారు.)

కమల్ : ఎంతయింది?

ఇంద్ర : పన్నెండున్నర.

కమల్ : మిమ్మల్ని ఎన్నిగంటలకు పిల్చారు ?

రచ : పదకొండు. నేను మరో ఇంటర్వ్యూకు వెళ్ళాల్సి వచ్చింది. అసలు యిక్కడికి రాలేననుకున్నా! అయినా ఒక చాన్సు చూద్దామని వచ్చాడు.

కమల్ : మిమ్మల్ని పిలవలేదనుకుంటా !

రచ : లేదు. అందుకే యింత ధైర్యం!

కమల్ : మీకేం అదృష్టవంతులు.

[అదే సమయంలో విమల్ మూకాభినయం ఆపి, రెండోవైపుగా బయటకు వెళ్ళిపోతాడు. గంట మోగుతుంది. కమల్ లేచి లోపలకి వెళతాడు.)

రచ : సిగరెట్ !

ఇంద్ర : నేను తాగను. థాంక్స్ !

రచ : (సిగరెట్ వెలిగించుకుంటాడు.) ఏమి అడుగుతున్నారో ఏమైనా తెలిసిందా?

ఇంద్ర : లేదు. అటునుండే బయటకు పంపించేస్తున్నారు.

రచ : సాధారణంగా అలాగే చేస్తారు. ఆ సోదరుల దగ్గర ప్రశ్నావళి చిన్నదే వుంటుంది.

ఇంద్ర : మీరు యిప్పుడు వెళ్ళివచ్చిన యింటర్వ్యూ ఎలా వుంది?

రచ : ఏమంత బాగా జరగలేదు. ఉద్యోగం చాలా మంచిది.

ఇంద్ర : అందుకే యిదివదిలి అక్కడికెళ్ళారు.

రచ : కాని నేనుచేసింది పొరబాటని గ్రహించారు. ఉద్యోగం కావాలంటే, చిన్న ఉద్యోగానికే ప్రయత్నించాలి. కనీసం ఉద్యోగం దొరికే అవకాశం వుంటుంది.

ఇంద్ర :  రెంటిలో ఏదో ఒకటి దొరకోచ్చుగా?

రచ :  అదృష్టం ఎలావుందో? నాకు ప్రస్తుతం ఉద్యోగం చెయ్యవలసిన అవసరం చాలా వుంది.

ఇంద్ర : అవసరం ఎవరికిలేదు?

రచ : అది నిజమేననుకో ! అందరికీ ఉద్యోగం అవసరం కావచ్చు. కాని నాకు మరీ అవసరం. మీదగ్గర  దాపరికం ఎందుకు? అప్పుచేసి ఒక చిన్నగది అద్దెకు తీసుకున్నాను. చిన్నగది కావాలన్నప్పుడు అద్దెకు దొరక్కపోవచ్చు. ఆ గదికి వేరే వసతులు లేకపోయినా నీటిసదుపాయం వుంది.

ఇంద్ర : మీరు చెప్పేది నాకు సరిగ్గా అర్ధం కాలేదు.

రచ : అదే.... నేను పెళ్ళిచేసుకున్నాను. నాన్నగారికి ఇష్టంలేదు. అద్దె కట్టలేకపోతే గది ఖాళీ చెయ్యాల్సి వుంటుంది. అప్పుతో ఎంతకాలం అని అద్దె కట్టగలను చెప్పు?

[కమల్ బయటకు వెళ్ళిపోతాడు. అమల్, విమల్, కమల్ ప్రవేశిస్తారు. ముగ్గురూ ఇంటర్వ్యూ టేబుల్ దగ్గర కుర్చీలో కూర్చుంటారు. అమల్ గంట వాయిస్తాడు. ఇంద్రజిత్ లేచి వెళ్ళి వాళ్ళదగ్గర కూర్చుంటాడు. మూకాభినయం నలుగురూ చేస్తుంటారు. రచయిత సిగరెట్ తాగుతూ-అంతలోనే పారేస్తాడు. లేచి ముందుకు వస్తాడు.]

రచ : అమల్ రిటైర్ అవుతాడు - అమల్ కొడుకు అమల్ ఉద్యోగం చేస్తాడు- విమల్ జబ్బు పడతాడు- విమల్ కొడుకు విమల్ ఉద్యోగం చేస్తాడు. కమల్  చనిపోతాడు- అతని కొడుకు కమల్ ఉద్యోగం చేస్తాడు. ఏవం ఇంద్రజిత్- ఇంద్రజిత్ కుమారుడు ఇంద్రజిత్. అక్కడ  పేవ్ మెంట్ మీద ఏడు సంవత్సరాల పిల్లవాడు చేత్తో చెక్కపెట్టె పట్టుకొని, చంకలో సంవత్సరం పిల్లతో నిల్చుని వుంటాడు. అక్కడే మరో అమ్మాయి నిల్చునివుంది. పేరు లీల. మరొకచోట ఆకాశం రాగరంజితంగా కన్పిస్తుంది. అది చూస్తూ కూర్చున్న మానసి జీవితం మీద ఆశల్ని పెంచుకుంటోంది. చాలా ఆశలు - తెలిసినవి - తెలియనివి- మంచివీ - చెడ్డవి - ఎన్నో ఆశలు - అన్నింటినీ కలిపితే రంగులరాట్నం....పైకీ కిందకూ తిరిగే రాట్నం.... నిరంతరం ఈ సృష్టి గిర్రున కిందకూ తిరుగుతూనేవుంది.

నియమబద్ధంగా తిరుగుతూనేవుంది.

ఆకాశం అస్తవ్యస్తంగా వుంది.

అచేత చేతన సంఘర్షణ.

జ్ఞాన- అజ్ఞాన ప్రసారం.

బంధించే ప్రయత్నం.

చేస్తున్నాను నిరంతరం.

తప్పదు. వీళ్ళకథ చెప్పక తప్పదు.

వీరి గాధల్ని నాటకబద్దంచేస్తాను.

కాని భాష ప్రాచీనం.

కథ బలహీనం.

ప్రకాశరేఖ క్షీణం.

మనక మసక ప్రకాశం.

స్మశాన ప్రశాంతి.

నాగరాజు బంధాలు.

నాలుగుదిక్కుల చుట్టాయి.

అక్కడే చితి అంటించి

వెలిగించాలి దివ్యజ్యోతి.

(ఇంద్రజిత్ వెళ్ళిపోతాడు. గంటప్రోగుతుంది.)

గంట మ్రోగుతోంది. (ఒక పరమాణువు పడిపోయింది. మరో పరమాణువు ఆహ్వానించబడుతోంది. మూడు పరమాణువులు పరస్పరం పిలుచుకుంటున్నాయి.) అసంఖ్య పరమాణువులు కలయికతో జన్మించిన ఈ భూమి

తిరుగుతోంది. సెకండ్, నిమిషం, గంట- ఒకదాని తర్వాత ఒకటి. గిర్రున తిరుగుతున్నాయి.

(మళ్ళీ గంటమ్రోగుతుంది. అమల్, విమల్, కమల్, చిరాగ్గాలేచి నిల్చుంటారు.)

గంట మ్రోగింది. మళ్ళీ మ్రోగుతుంది. అయినా పృథ్వి, శతాబ్దం వున్నాయి. మన పృథ్వి. మన శతాబ్దం. చక్రం.....ప్రశ్నలు-పోనియ్! వాటి దారిని వాటిని పోనియ్! మేము ఉంటాం! అమల్, విమల్, కమల్, ఏవం ఇంద్రజిత్ . నేను, మేము ఉన్నాం. ఈ పృథ్విమీద వున్నాం.

(అమల్ , విమల్, కమల్ - విసుగుతో గంట గట్టిగా మ్రోగిస్తారు. వారి మీదకు క్రమంగా చీకటి పాకుతుంది. రచయితమీద వెలుతురు తీక్షణంగా పడుతుంది.)

నేను అఖండిత పదార్థాన్ని.

కణ కణ నిర్మిత వ్యక్తిని.

బ్రతికివున్నాను - బ్రతికివుంటాను.

వృద్ధ శతాబ్ది కూర్చొనివుంది.

వివాలని నా గానం.

కర్ణపుటాలను విచ్చుకొని

విసుగూ విరామం లేకుండా

తిరుగుతూనేవుంది వసుధ నిరంతరం.

అపరాజిత - అజేయ.

(అకస్మాత్తుగా వెలుగు ఆరిపోతుంది. చీకట్లో యవనిక పడుతుంది. అయినా పాట విన్పిస్తూనేవుంది.)

వృద్ధ శతాబ్ది కూర్చొనివుంది.

వినాలని నాగానం

కర్ణపుటాలను విచ్చుకొని

విసుగూ విరామం లేకుండా

తిరుగుతూవుంది వసుధ నిరంతరం

అపరాజిత - అజేయ.

[ప్రథమాంకం సమాప్తం]

## ద్వితీయాంకం

(ఒక ప్రక్కగా ఒక టేబుల్, నాలుగు కుర్చీలు ఉంటాయ్. ఒక ఖాళీబల్ల. దానివెనక పెద్దటేబుల్ - కుర్చీ - టెలిఫోన్ - రచయిత టేబుల్, కుర్చీలు తుడుస్తూ వుంటాడు. అతని ముఖంలోగాని, వస్త్రధారణలోగాని ఎలాంటి మార్పులేదు.)

రచ : ఇంటినుండి స్కూలుకు, స్కూలునుండి కాలేజీకి- కాలేజీనుండి ప్రపంచంలోకి - ప్రపంచం ఒక ఆఫీసు - ఇలాంటిదే అదీ ఒక ఆపీసు. ఇక్కడ చాలామంది పనులు చేస్తారు. పెద్దపెద్దపనులు - ముఖ్యమైన పనులు. ఇక్కడ చాలామంది పని చేస్తున్నారు.

అమల్, విమల్, కమల్, ఇంద్రజిత్.
(అమల్, విమల్ ప్రవేశిస్తారు.)

అమల్ : ఎనిమిదీ యాభైకు రావాల్సిన రైలు పదినిమిషాలు ఆలస్యంగా వచ్చింది యీరోజు.

విమల్ : చార్ మినార్ దగ్గర బస్ ఆగిపోవటం వల్ల ట్రాఫిక్ జామ్ అయింది.

(కమల్, ఇంద్రజిత్ ప్రవేశం. అమల్, విమల్ కూర్చుంటారు)

కమల్ : తొమ్మిదింబావు బండి ఇవ్వాళకూడా అందలేదు.

ఇం : రెండు బస్సులు వెళ్ళిపోయాయి. కాలుపెట్టడానికి కూడా స్థలం దొరకలేదు.

(కమల్ - ఇంద్ర కూర్చుంటారు.)

అమల్ : (విమల్ తో) పిల్లవాడు ఎలావున్నాడు?

విమల్ : బాగానే వున్నాడు. (కమల్ తో) మీ అమ్మాయికి సీటు దొరికిందా?

కమల్ : ఇంకాలేదు. (ఇంద్రతో) నీకు దొరికిందా ?

ఇం : లేదు. ఎవరో కొట్టేశారు.

అమల్ : హరీష్ !

విమల్ : హరీష్ !

ఇం : హరీష్ !

అమల్ : (పెద్దగా ) హరీష్ !

రచ : అయ్యా ! చెప్పండి.

అమల్ : మంచినీళ్ళు.

విమల్ : (పెద్దగా) హరీష్ !

రచ అయ్యా!

విమల్ : బీడా తీసుకురా -కొంచెం జర్దా కూడా.

కమల్ : (గట్టిగా) హరీష్ !

రచ : అయ్యా!

కమల్ : రెండు సిగరెట్లు - కత్తెర మార్కు.

ఇం : (గట్టిగా) హరీష్ !

రచ : అయ్యా !

ఇం : ఈ ఉత్తరం పోస్ట్ చెయ్!

[రచయిత తన స్థానంనుండి కదలడు. వాళ్ళలో ఎవరూ అతనికి డబ్బులు కానీ, ఉత్తరంకానీ యివ్వరు.]

అమల్ : ఈ పిక్ పాకెట్ గాళ్ళ పీడ మరీ ఎక్కువైపోయింది. ఆ రోజు యూనివర్శిటీ బస్ కోఠీ స్టాప్ దాటిందో లేదో ....

విమల్ : హోమియోపతి మందు తినాలంటే వెంకటాచారి దగ్గరకే వెళ్ళు. మా బావమరిదికి క్రానిక్ డీసెంట్రీ వచ్చింది....

కమల్ : మూడోక్లాసు సీటుకు పెద్ద టెస్టు ఒకటి. ఇంగ్లీషు, తెలుగు, లెఖ్కలు -పైగా బర్త్ సర్టిఫికెట్ లేకుండా... ...

[ఒక్కసారి రచయిత గంభీరంగా పెద్ద టేబుల్ దగ్గర కెళతాడు. అమల్ , విమల్ , కమల్ , ఇంద్ర కొంచెం లేచి తల గోక్కుంటూ కూర్చుంటారు రచయిత కుర్చీమీద కూర్చోగానే గంట మ్రోగుతుంది.]

రచ : హల్లో ! హల్లో....యస్ ... యస్... ఆర్డర్ ... చలాన్ ... డెలివరీ ... ఫిఫ్టీన్ పర్సెంట్...యస్ ...బాయ్ ... (ఇక్కడనుంచి ఫైల్స్ తీసుకెళుతుంటారు. పైల్సు తెచ్చి పెడుతుంటారు. అమల్ వచ్చి ఒక పైలు మీద ఆర్డర్స్ వేయించుకొని వెళతాడు. కమల్ , విమల్, ఇంద్ర ఒకరి తర్వాత ఒకరు ఫైల్స్ తీసుకెడుతుంటారు.)

రచ : హల్లో.... హల్లో... యస్ ... యస్ ... ఆర్డర్ ... చలాన్ ...డెలివరీ... ఫీఫ్టీన్ పర్సంట్ ...యస్ ... యస్ ... బాయ్...

(మళ్ళీ ఫైల్స్ అటూ యిటూ)

అమల్ : హరీష్ !

విమల్ : హరీష్ !

కమల్ : హరీష్ !

ఇం : హరీష్ !

(రచయిత లోపలనుంచి చేతిలో పంఖాతో వచ్చి స్టూలుమీద కూర్చుంటాడు.)

అమల్ : హరీష్ !

విమల్ : హరీష్ !

కమల్ : హరీష్ !

ఇం : హరీష్ !

(రచయిత లేచి  ఒక్కొక్కరి దగ్గరకు వెళతాడు.)

రచ : అయ్యా ! అయ్యా ! అయ్యా ! అయ్యా!

అమల్ : విమల్ బాబు!

(రచయిత అమల్ పైలు విమలకు యిస్తాడు. విమల్ దాన్ని అందుకొని మరొక పైలు అందిస్తాడు.)

విమల్ : కమల్ బాబు!

(రచయిత  విమల్  పైల్ కమల్ కు  యిస్తాడు.)

కమల్ : నిర్మల్ బాబు !

రచ : నిర్మల్ బాబు రిటైర్ అయిపోయారు సర్ !

కమల్ : ఓ ... ఇంద్రజిత్ బాబు!

(రచయిత కమల్  పైల్ ఇంద్రజిత్ కు  యిస్తాడు.)

ఇం : అమల్ బాబూ !

అమల్ : విమల్ బాబూ !

విమల్ : కమల్ బాబూ !

కమల్ : ఇంద్రజిత్ బాబూ !

[ఈ విధంగా మూడుసార్లు పిలుస్తారు. ప్రతిసారి కంఠాళ స్థాయి పెరుగుతుంది. రచయిత ఆసులో గొట్టంలా అటూ ఇటూ తిరుగుతాడు. గంట మ్రోగుతుంది. రచయిత లోపలకు వెళ్ళి ఆఫీసరు ఆదేశాన్ని అందుకొని వస్తాడు.]

అమల్ : హరీష్ !

విమల్ : హరీష్ !

కమల్ : హరీష్ !

ఇం : హరీష్ !

రచ : పెద్దయ్యగారికి టీ తేవడానికి వెళుతున్నా సర్ !

అమల్ : ఆఁ.

విమల్ : ఆఁ.

కమల్ : ఆఁ.

ఇం : ఆఁ.

[రచయిత టీకి వెళ్ళటానికి బదులు తిరిగొచ్చి ఎదురుగా నిల్చుంటాడు.]

రచ : ఫైల్ ... టీ ... మళ్ళీ ఫైల్ ... టిఫిన్ ... మళ్ళీ ఫైల్ ... మళ్ళీ టీ ... మళ్ళీ ఫైల్ ... ఆ తర్వాత ట్రాం, బస్, ట్రైన్... ఇంతకంటేపెద్ద ఆఫీసుల్లో కూడా యిదే ...ఫైల్ , టీ, టిఫిన్ ...ఆ తర్వాత హిందూస్థాన్... ఫియట్ ....స్టాండర్డ్....

అమల్ : హల్లో శాస్త్రీ ! ఓల్డ్ బాయ్! ఇవ్వాళ క్లబ్బుకు వెళుతున్నావా?

విమల్ : లేదు. ఇంటికెళ్ళాలి. ఇవ్వాళ మా ఆవిడ తన ఫ్రెండ్స్ కు పార్టీ యిస్తోంది.

కమల్ : హల్లో చౌదరి! ఓల్డ్ బాయ్ ! కారు గరాజ్ నుండి బయటకు తీశావా?

ఇం : ఎందుకడుగుతావు ? క్లచ్ ప్లేట్ కాలిపోయింది. టాక్సీల సంగతి యిక అడగనే అక్కర్లేదు. ప్రొద్దుట మా పనివాడు నలభై అయిదు నిమిషాల తర్వాత తిరిగి వచ్చాడు.

(రచయిత లోపల పెద్ద ఆఫీసరు దగ్గరవుంటాడు. ఫోన్ వస్తుంది.)

రచ : హల్లో - హల్లో - యస్ - Board of Directors - Conference - Budget - Annual budget - yes - yes - బాయ్ ! మిస్ మల్ హోత్ర....

(మానసి చేతిలో షార్ట్ హ్యాండ్ పుస్తకం తీసుకొని వస్తుంది.)

మా : yes sir !

రచ : (పచారు చేస్తూ)

With refence to a bove lettler in connection with the above matter. I would request you - I shall be obliged if - forward us at your earliest convenience - let this office know immediately 15th ultimo - 25th instance - thanking you, assuring you of our best Co- operation - yours sincerely - yours sincerely-

(టెలిఫోన్)

హల్లో - yes -yes - Board of Directors - con - ference -Budget annual report - yes -yes -boy !- that is all Miss Malhotra ! -

(మానసి ప్రస్థానం - రచయిత బైటకు వస్తాడు.)

దట్ - యూజ్ ఆల్ మిస్ మల్ హోత్రా -దట్ యూజ్ ఆల్ లేడీస్ అండ్ జెంటిల్ మన్. దట్ యూజ్ ఆల్ !

అమల్ : That is all !

విమల్ : That is all !

కమల్ : That is all !

(అందరూ కోరస్ లో దట్ యూజ్ ఆల్ అంటారు. ఇంద్ర మౌనంగా వుంటాడు. ముగ్గురూ ఇంద్రను ఒక్క క్షణం చూసి ఫక్కున నవ్వుతారు.)

అమల్ : బక్ అప్ ఓల్డ్ బాయ్!

విమల్ : చీరియో ఓల్డ్ బాయ్!

కమల్ : ఆల్ ద వెస్ట్ ఓల్డ్ బాయ్!

(ఒక్కొక్కరే ఇంద్ర వీపు తడుతూ ముగ్గురూ వెళ్ళి పోతారు. ఇంద్ర కూర్చునే వుంటారు. రచయిత వెనక్కు వెళ్ళిచీపురు తీసుకొని ఊడవడం మొదలెడతాడు. ఇంద్ర అన్యమనస్కంగా ఫైల్స్ చూస్తాడు.)

రచ : ఏమిటి సర్ !వెతుకుతున్నారు!

ఇం : ఆఁ! అవును వెతుకుతున్నాను.

రచ : ఏమిటి?

ఇం : ఏదో !

రచ : ఏదో ఏమిటి?

ఇం : ఆఁ కాదు....ఏమీలేదు....ఏమిలేదు....ఇంతకంటే ఏమిలేదు.

రచ : మీరు వెదుకుతున్న దేంటో నాకర్థంకాలేదు. సార్!

ఇం : ఏదీ దొరకడంలేదు హరీష్ ! సరే పోనియ్ ! రేపు ఉదయం ఈఫైల్ అమల్ బాబు టేబుల్ మీద పెట్టు. ఇది విమల్ బాబుకు, అది కమల్ బాబుకు యివ్వాలి. ఈ ఫైల్లో పెద్దయ్యగారి సంతకం తీసుకో. నేను రేపు రాలేకపోవచ్చును.

రచ : మీ ఆరోగ్యం బాగాలేదాసర్ !

ఇం : ఆరోగ్యమా ? రేపు బాగుండకుండా పోవచ్చు. సరే నేను వెళ్తున్నా !

(ఇంద్ర వెళ్ళిపోతాడు.)

రచ : అమల్ వెళ్ళాడు. విమల్ వెళ్ళాడు. కమల్ కూడా వెళ్ళిపోయాడు. ఇంద్రజిత్ మాత్రం ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఇప్పుడు అతనూ వెళ్ళిపోయాడు.

నేను కూర్చొని ఆలోచిస్తున్నాను....నేను....

నేను ఆలోచిస్తున్నాను.

కేవలం ఆలోచిస్తున్నాను.

నేను పిట్టకథలోని భాగాన్ని.

నా జీవితం అనంత శూన్యం

లో విలీనం అవుతుంది.

(అంతలోనే అర్ధచైతన్యంలో మధుర ప్రతిధ్వనితో తిరిగివస్తోంది.)

పృథ్వీకణాలు చూర్ణమై

మట్టిలో కలుస్తున్నాయ్.

కాలం అనే చేత

దాన్ని నిరంతరం చెరుగుతోంది.

గట్టి పదార్థాన్ని వెతుకుతోంది.

ఈ ధూళి కణాల్లో

జీవితబీజం నిక్షిప్తమైవుందా?

ఇదంతా వ్యర్థ ప్రేలాపన

భవిష్యత్తులోని బీజాలను

పేర్చి నవ సృష్టి సాగించాలని

పెరుగుతోంది కోర్కెనాలో

(ఈ మట్టి చాలా పురాతనం శూన్యం ఆకాశం - కల్పనవ్యర్థం నవసృష్టి స్వప్నం - వ్యర్థం)

నేను కూర్చొని ఆలోచిస్తున్నాను.

ఆలోచిస్తూనే వున్నాను.

మానవుడు అపూర్ణుడు.

అయినా ఎందుకో మనస్సు

వెతుకుతూనే వుంటుంది.

సంపూర్ణ మానవుడికోసం.

(పిన్ని ప్రవేశిస్తుంది)

పిన్ని : నువ్విక్కడ కూర్చున్నావా? నీకోసం వెతికి వెతికి ప్రాణం విసిగిపోయింది. ఇక్కడ ఏం చేస్తున్నావ్?

రచ : ఆలోచిస్తున్నాను.

పిన్ని : అంత పెద్ద ఆలోచనేమిటో చెప్పు, నాకూ వినాలని వుంది.

రచ :  మేము ఎవరం అని ఆలోచిస్తున్నాను.

పిన్ని : మీరు మీరే ! ఇందులో ఆలోచించడానికికేముంది?

రచ : నిజమే! ఇంతవరకు ఆ విషయం నాకు తట్టనే లేదు. కానీ మేము ఏమిటి?

పిన్ని : ఏం ప్రశ్నరా నాయనా !  మేము ఏమిటి ? మీరు  రత్నపు తునకల్లాంటి కుర్రాళ్లు. బాగా చదువు కున్నారు. మంచి మంచి ఉద్యోగాలు చేస్తున్నారు.

రచ : సరిగ్గా చెప్పావు పిన్నీ! రత్నపుతునక : తునకలం అనేది  నేనూ ఒప్పుకుంటాను. కానీ రత్నపు తునకలం అనేది నా బుర్రకు ఎక్కడం లేదు.

పిన్ని : ఏమిటిరా నీ ఆలోచనలూ నువ్వూను.

రచ : ఆలోచనలు !నిజం ! కాని నువ్వు టకటకా నా రెండు ప్రశ్నలకు జవాబులిచ్చావు. మరో ప్రశ్నకుకూడా...

పిన్ని : ఏమిటాప్రశ్న ?

రచ : మేం ఎందుకున్నాం ?

పిన్ని : ఎందుకుండటమేమిటి?

రచ :  అంటే....అదే మేం ఎందుకు ఉండాలి అని?

పిన్ని : ఆహ ! ఏం ప్రశ్న ? ఎందుకు ఉండకూడదు ? మీ రున్నందువల్ల ఎవరికీ ఏం బాధ వచ్చింది? కాస్త వివరంగా చెప్పు వింటాను.

రచ : ఊఁహు ! ఈ జవాబు లాజికల్ గా లేదు.

పిన్ని : లాజిక్ మాట్లట్టానికి ఎవరూ యిక్కడలేరు. నీ మాటలన్నీ చిత్రంగానే వుంటున్నాయి. అందుకే పెళ్ళి చేసుకోమంటున్నాను.

రచ : మధ్య పెళ్ళివిషయం ఎందుకు?

పిన్ని : పెళ్ళివిషయం అక్కర్లేదు. ఏమిటీ, ఎవరూ, ఎందుకూ అనేవి కావాలి. అసలు నువ్వు పెళ్ళెందుకు చేసుకోనంటున్నావో ముందు చెప్పు.

రచ : చాలా కఠినమైనప్రశ్న వేశావు పిన్నీ ! పెళ్ళి ఎందుకు చేసుకోవాలి ? ఆలోచించి నాకు మతిపోతోంది.

పిన్ని : పెళ్ళెందుకేమిటి ? అందరూ ఎందుకు చేసుకుంటున్నారు- అందుకే!

రచ : దొరికింది! ప్రశ్నకు సమాధానం దొరికింది.

ఎందుకు తుమ్ముతావ్ ?ఎందుకు దగ్గుతావ్?

తియ్యతియ్యగా ఎందుకు మందహాసం చేస్తావ్?

ఎదుటివాడు ఆవలిస్తే ఎందుకు చిటిక వేస్తావ్?

అందరూ చేస్తారు కనుక నువ్వూ చేస్తావ్?

పిన్ని : కవిత్వం ప్రారంభించావ్ ? నేను వెళ్తున్నా!

[రచయిత ఆమె దారికి అడ్డం వస్తాడు.]

రచ : కవిత్వం పేరువిని పారిపోతున్నావ్ ఎందుకూ?

పెద్దగా రేడియో పెట్టి వదివేస్తావ్ ఎందుకూ?

పప్పులో వేస్తావెందుకు గుప్పెడు కారం?

అందరూ చేస్తున్నారు కనుక నువ్వూ చేస్తున్నావ్!

పిన్ని : పప్పులో గుప్పెడుకారం నేనెప్పుడు వేశాను?

రచ : టైం చూసి పరుగెత్తుతావెందుకు కత్తితో?

రాట్నంలో నూనె వేస్తావెందుకు?

అందరూ చేస్తారు, అందుకే నువ్వూ చేస్తావ్!

పిన్ని : ఏమిట్రా పిచ్చిమాటలూ నువ్వూ ? ఆ మూడు ముళ్ళు పడితే పిచ్చి కాస్తా రెండు రోజుల్లో ఎగిరిపోతుంది.

(పిన్ని వెళ్ళిపోతుంది)

రచ : వివాహం, జన్మ-వివాహం మృత్యువు - జన్మ-తర్వాత వివాహం- ఆ తర్వాత మృత్యువు. చాలాకాలం క్రితం నేను ఒక మంచి కథ చదివాను. మీలో ఎంతమంది ఆ కథ చదివారో నాకుతెలియదు. చాలావరకు, కథ మర్చిపోయాను. అయినా ... ఒక రాజకుమారుడు. ఒక రాజకుమార్తె, ఎన్నో కష్టాల తర్వాత ....ఆ తర్వాతే అసలుకథ ప్రారంభం....ఇద్దరూ సుఖంగా సంసారం చేశారు...రాజ్యం చేశారు సుఖంగా వున్నారు కనుక ఆ పైన కథ రాయటానికి అవకాశం లేకుండా పోయింది....

(నేపథ్యంలో శంఖా రావం. మానసి పెళ్ళికూతురు వేషంలో స్టేజీ మధ్యకువచ్చి నిలబడుతుంది.)

రచ : వివాహం. ఒక పురుషుడు ... ఒక స్త్రీ ... దంపతి- జంపతి - జయాపతి....తిన్నగా చెప్పాలంటే పెళ్ళి కూతురు - పెళ్ళికొడుకు.

(అమల్ ప్రవేశిస్తాడు. కొత్తపెళ్ళికొడుక్కు ఉండాల్సిన సంతోషం కన్పిస్తుంది.)

అమల్ : వక్కపొడి యివ్వు!

మా : గూట్లోవుంది తీసుకోండి!

అమల్ : ఎక్కడుందో నాకు తెలియదు.

మా : తెలియదూ? ఇంతకాలంగా ఎవరు యిచ్చారో?

అమల్ : ఇంతకాలం 'నా' అనేవాళ్ళు నాకెవరున్నారు గనుక?

మా : ఊరుకుందురూ, ఎవరైనా వింటారు.

అమల్ : వింటారా? అయితే చెవులో రహస్యంగా చెప్పనా?

మా : అబ్బ ఊరుకోండీ! ఎవరైనా వస్తారు. మీరు బయటకు వెళ్ళిపోదురూ!

(అమల్ నిష్క్రమణ)

రచ : దంపతి - జంపతి - జయాపతి అంటే భార్యా, భర్త.
(మానసి తలమీద ముసుగు జారిపోతుంది. పెళ్ళి కూతురిలా కన్పించదు. గృహిణిలా కన్పిస్తుంది. విమల్ చేత్తో పత్రిక పట్టుకొని ప్రవేశిస్తాడు. కుర్చీలో కూర్చొని చదవడం ప్రారంభిస్తాడు. మానసి దగ్గరకు వస్తుంది.)

మా : ముఖ్యమైన వార్తలు వున్నాయా?

విమల్ : ఏం లేవు. మామూలే !

మా : అహాఁ ! నేను ప్రపంచం మునిగిపోయే వార్త ఏదో వుందనుకున్నానులే!

విమల్ : ఎందుకలా అనుకున్నావ్ ?

మా : తలన్నా ఎత్తకుండా ఆ చదివేతీరు చూసి అనుకున్నాను.

విమల్ : అబ్బే ! అదేం లేదు. (పత్రికపడేసి) ఆఁ ఏమిటి అంటున్నావ్ ?

మా : సాయంకాలం మీకేదైనా పనుందా ?

విమల్ : ఎందుకు?

మా : ఏంలేదు. సాయంకాలం కులాసాగా అలా బైటకు వెళ్దామని.

విమల్ : ఇవ్వాళ మా ఆఫీసులో ఒకాయన తిటైర్ అవుతున్నాడు. ఆయనకు పార్టీ యిస్తున్నాం- నువ్వెక్కడి కెళ్ళాలని.

మా : ఎక్కడికీ లేదు....గడ్డంగీచుకోరూ? ... అప్పుడే తోమ్మిదయింది.

విమల్ : తొమ్మిదా ? ఓ మైగాడ్!

(విమల్ వెళ్ళిపోతాడు.)

రచ : దంపతి - జంపతి- జయాపతి-అంటే మొగుడూ - పెళ్ళాం.
(కమల్ ప్రవేశిస్తాడు)

మా : మీకు అసలు మతివుందా అంట? పిల్లవాడి జ్వరం సంగతి తెలిసీ రాత్రి పదిగంటలకు కోపంకు చేరతారా?

కమల్ : బార్లీ తెచ్చాను. ఇంద!

మా : తెచ్చారు బార్లీ ! రాత్రి పదిగంటలకు, ఇంట్లో బార్లీ అయిపోందని తెలుసు. బిడ్డకు ఏం యిస్తాననుకున్నారు?

కమల్ : పూర్తిగా అయిపోయిందా?

మా : అడుగూ బోడుగూవుంటే జావా కాశాను.

కమల్ : బాబు  ఎలా వున్నాడు?

మా : జ్వరం తొంబైతొమ్మిదివుంది. బత్తాయ్ కాయలు తెచ్చారా?

కమల్ : రోజూ తెచ్చే చోట రూపాయికి నాలుగు చెప్పారు. రేపు పెద్ద మార్కెట్ కు వెళ్ళి తెస్తాలే!

మా : కాళ్ళూ, చేతులూ కడుక్కురండి, భోజనం వడ్డిస్తాను.

(ఇద్దరూ చెరోవైపూ నిష్క్రమిస్తారు.)

రచ : దంపతి - జంపతి - జయాపతి. భార్యాభర్త - మొగుడూ పెళ్ళాం -అమల్ , విమల్ , కమల్, ఏవం ఇంద్రజిత్ .

(ఇంద్రజిత్ ప్రవేశం)

రచ : ఇంద్రజిత్తా?
ఇం : అరే నువ్వా ! ఎంత ఆశ్చర్యం ? నిన్ను యిలా కలుసుకుంటానని అనుకోలేదు సుమా!

(ఇద్దరూ గట్టిగా చేతుల కలుపుతారు.)

రచ : ఎన్ని సంవత్సరాలకు నిన్ను చూశాను?

ఇం : అవును. దాదాపు ఏడు సంవత్సారాల తర్వాత!

రచ : ఇంతకాలం ఎక్కడున్నావ్ ? భోపాల్ లోనేనా?

ఇం : కాదు. (భోపాల్ ఉద్యోగం సంవత్సరం తిరక్కుండానే ఊడిపోయింది) ఆ తర్వాత చాలా ప్రదేశాలు తిరిగాను. బొంబాయి, జలంధర్, మీరట్, ఉదయ పూర్ - ఒకటేమిటి ...తిరిగే ఉద్యోగం... ఒకటే బదిలీలు....

రచ : నీకు తిరగటం యిష్టమేగా ?

ఇం : ఇష్టమా ? ఏమో !

రచ : కొయ్యకు కంగారు, పెరూ, ఎస్కిమో ...అవన్నీ మర్చిపోయావా ?

ఇం : అవన్నీ నీకు యింకా గుర్తున్నాయా? సరళ భూగోళ పరిచయం....

రచ : ఏం నువ్వు మర్చిపోయావా ?

ఇం : మర్చిపోలేదు. కాని మారిపోయాననుకుంటున్నాను. ఆనాడు ఒక రూపాయ పన్నెండణాలు జేబులో వేసుకొని మద్రాసు బయలుదేరి వుంటే ఇవ్వాళ ఎలా వుండేవాణ్ణో చెప్పలేను. భూగోళందాటి భూమిలేదు అనిపిస్తుంది - ముఖ్యంగా మన దేశంలో.

రచ : పరదేశంలో.

ఇం : పరదేశాలు యింకా వెళ్ళలేదు. మలయా వెళ్ళటానికి ఇంటర్వ్యూకు హాజరయ్యాను. కాని ఆ వుద్యోగం దొరకలేదు.

రచ : దొరికితే వెళ్ళేవాడివా?

ఇం : ఎందుకెళ్ళను ?

రచ : పెళ్ళి చేసుకునట్టు లేదు ?

ఇం : ఏదీ టైం వుంటేగా ? నీ విషయం?

రచ : ఇద్దరం ఒకే బాటలో వున్నాం.

ఇం : అందరూ ఎలా వున్నారు?

రచ : అందరంటే ?

ఇం : అదే.... అమల్ , విమల్ , కమల్.

రచ : అందరూ బాగానే వున్నారు. ఉద్యోగాలు చేస్తున్నారు. సంసారాలు చేస్తున్నారు.

ఇం : నీ మాటల్ని బట్టి అందరూ బాగా వున్నట్టు అన్పించడం లేదు.

రచ : అదేం లేదు. అందరూ బాగానే వున్నారు. నాకు వాళ్ళంటే ఎలాంటి అసూయా లేదు. నీకు కలుగుతుందా?

ఇం : ఏమో ! చెప్పలేను.

రచ : మానసి ఎలావుంది?

ఇం : మానసి ? అరే, అవునుగదూ! నువ్వు ఆమెను మానసి అనేవాడివి గదూ! బాగానే వుంది.

రచ : ఎక్కడ వుంటుంది ?

ఇం : పెళ్ళి చేసుకుందా లేదా అని తెలుసుకోవాలనేగా నీ వుద్దేశ్యం ? ఇంకా చేసుకోలేదు. నిజామాబాద్ లో ఒక స్కూల్లో పనిచేస్తూంది.

రచ : ఇంకా విశేషాలు ఏమిటి?

ఇం : నీకెలాంటి విశేషాలు కావాలో ముందు చెప్పు.

రచ : నువ్వు చెప్పదల్చుకున్నదే చెప్పు.

ఇం : నిజానికి విశేషాలంటూ ఏమీలేవు. నేను ఉద్యోగం చేస్తున్నాను. ఆమె ఉద్యోగం చేస్తూంది. నేను ఉత్తరం రాస్తాను. ఆమె జవాబు యిస్తుంది. సంవత్సరానికి ఒకసారి కలుసుకుంటాం! మేమిద్దరం ముందే ప్లాను వేసుకొని శెలవు తీసుకుంటాం. బెంగుళూర్ లో కలుసుకుంటాం.

రచ : మీరిద్దరూ వివాహం చేసుకుంటారా?

ఇం : చేసుకోము అని చెప్పలేను. కాని యింతవరకు చేసుకోలేదు.

రచ : వివాహం ఎందుకు చేసుకోరు?

ఇం : ప్రత్యేకించి యిదీ అని చెప్పలేను. పరీక్ష పాసుకాగానే చేసుకుంటే బాగానే వుండేది. అదుగో___ఆ మైదానంలో కూర్చొని ఎన్ని కలలు కన్నానో... ఎన్ని ప్లాన్లు ఆలోచించానో? ఒక రోజు ఏమయిందో తెలుసా?

[మానసి ప్రవేశిస్తుంది దగ్గరగా వచ్చి కూర్చుంటుంది. రచయిత ఒక మూలకు - చీకట్లోకి వెళ్ళిపోతాడు.]

మా : ఇంద్రా ..... నా వల్లకాదు.....

ఇం : ఏం కాదు?

మా : ఎందుకింత మొండి పట్టుదల చెప్పు! నాకు కొంత సమయం యివ్వు ఆలోచించుకోవటానికి.

ఇం : సమయం -సమయం -సమయం ! నువ్వు ఆరునెల్లుగా అడుగుతున్న మాటే యిది!

మా : నన్నేం చెయ్యమంటావ్ ? నువ్వే చెప్పు! నీకున్న సాహసం నాకు లేదు.

ఇం : సాహసం లేదు అనకు, ఇష్టంలేదు అను.

మా : ఇష్టం వున్న పనులన్నీ చెయ్యగలమా?

ఇం : అన్నిటి సంగతి నాకు తెలియదు. ఇష్టం వుంటే పెళ్ళిచేసుకోవచ్చు అని మాత్రం నాకు తెలుసు.

మా : మగవాళ్ళు ఏమైనా....

ఇం : మగవాళ్ళు ఏదైనా చెయ్యగలరు - అనేగా అనబోతున్నావ్ ?స్త్రీలు ఆలోచించగలరు. సమయంలో అడగగలరు.

మా : ఎందుకంత కోపం?

ఇం : కోపమెందుకు ? రేపు నేను మాద్రాస్ వెళుతున్నాను. ఇదేదో తేల్చుకుందాం అనుకుంటున్నాను.

మా : మద్రాసు వెళ్ళటానికీ....దీనికీ సంబంధం ఏమిటి?

ఇం : అదంతా నాకు తెలియదు. ఒక్క సంగతి మాత్రం చెప్పదల్చుకున్నాను.

మా : ముందు మద్రాసు వెళ్ళి ఆ తర్వాత చెప్పదల్చు కున్నదేదో తేల్చుకో !

ఇం : నన్నంటావ్ ? నీకే కోపం వచ్చింది.

మా : కోపం కాదు ఇంద్ర ! బాగా ఆలోచించే మాట్లాడుతున్నాను. జీవితం అంటే పిల్లల ఆట కాదు.

(ఇంద్ర చూస్తూ వుంటాడు. చీకటి - మనసి వెళ్ళిపోతుంది. రచయితమీద వెలుతురు పడుతుంది. ఇంద్ర లేచి రచయిత దగ్గరకు వస్తాడు.)

ఇం : మేమిద్దరం కూడా జీవితాన్ని పిల్లల ఆటగా అంగీకరించలేక పోతున్నాం. చాలా ఆలోచించాను. లాభ నష్టాల లెఖ్ఖవేశాను. ఇంకా వేస్తున్నాను. జీవితం నిజంగా పిల్లల ఆట అయి కూర్చుంటుందేమోనని అనిపిస్తోంది. జీవితం..... అమూల్యమైన జీవితం! పేపరు చదువుతుంటావా?

రచ : అప్పుడప్పుడు.

ఇం : ఒకసారి ఎప్పుడో చదివాను. అమెరికాలో అణు- అస్త్రాలంటే ఒక ఆటలా అయిందట. రైల్వేసిగ్నల్ లా ఓకే స్విచ్ వుంటుందట. దాంట్లోనే అన్ని యింటర్ లింక్స్ వుంటాయిట. ఏ పొరపాటునో ఒక ఆటం బాంబో పేలితే ప్రపంచమే నాశనం అవుతుందని తెలుసా?

రచ : నువ్వు చెప్పదలచుకున్న దేమిటి ?

ఇం : అదే... జీవితం ఎంత అమూల్యమైందో .... దాన్ని గురించి ఎన్నిరకాల ఆలోచనలు చేస్తామో !

రచ : అంటే నీకు వివాహం చేసుకోవాలని వుంది. కాని అందుకు మానసి సుముఖంగా లేదు. అంతేనా ?

ఇం : అందుకని, ఎప్పుడూ ఆటంబాంబు గురించే ఆలోచిస్తూ కూర్చుంటున్నానని అనుకుంటున్నావా? రాత్రిపూట ఆకాశంలోని నక్షత్రాలను చూస్తున్నప్పుడు, జ్యోతిష శాస్త్రం చదువుతున్న ప్పుడూ ఈ పృథ్వి ఎంత అల్ప మైందో తెలుస్తుంది. అల్పమైన ఈ పృథ్వీమీద నివశించే ప్రాణుల్లో ఒకడైన మానవుడు ఎంత అల్పుడో తెలుస్తుంది. కాని అదే ఆలోచన ఎల్లప్పుడూ మనం చేస్తామా? చేస్తే బతగ్గలమా ?

రచ : నువ్వు ఆలోచిస్తూనే వున్నావుగా ?

ఇం : ఏం చెయ్యమంటావ్ ? ఆలోచించకుండా వుండలేను. జీవితం అంటే మహామృత్యువు ముందు మెరిసే క్షణికమైన మెరుపుమాత్రమేనని మర్చిపోతూవుంటాను. ఈ బ్రహ్మండంలో నా జీవితానికి ఒక యిసుక రేణువుకు వున్న మూల్యంకూడా లేదనే విషయాన్ని విస్మరిస్తూ వుంటాను. నా జీవితం కంటే అమూల్యమైంది మరొకటిలేదని గర్విస్తుంటాను.

రచ : అలా అనుకోగలగటం మానవునికి ప్రకృతి ప్రసాదించినవరం. లేకపోతే మనిషి బ్రతకలేడు.

ఇం : ఆ వరం అన్ని వేళలా రక్షించలేదు. జ్ఞానఫలం రుచి... నక్షత్రమయ ఆకాశం...ఇవన్నీ ఆలోచనల్ని తారుమారు చేస్తుంటాయి... నువ్వూ, నేనూ, మానసి, అమల్ , విమల్ , కమల్....

(వాద్య సంగీతంలో ఇంద్ర స్వరం కలిసిపోతుంది. స్టేజి అంతటా చీకట్లు కమ్ముకుంటాయి. రచయితమీదా, ఇంద్రమీదా కొద్దిగా వెలుతురు పడుతుంది. పల్చటి ప్రకాశరేఖ ఒకటి వెనగ్గా నిల్చున్న మానసిమీద పడుతుంది. వాద్యసంగీతం - కవితాపాఠంగా మారుతుంది.)

కంఠస్వరం :

పృథ్వి కలుస్తుంది సాగరంలో

దూరంగావున్న క్షితిజంలో లీనం అవుతుంది సాగరం.

ఆఖిల బ్రహ్మాండంలో

పృథ్వి ఉనికి అదృశ్యంగా వుంది.

పృథ్వి అస్థిత్వం - రెండు క్షణాల జేవితం

అనంతకాలగతిలో

విలాసమాత్రంగా జీవితధార ప్రవహిస్తోంది.

(జీవిత  యితిహాసం, క్షణిక ఆకస్మిక సంఘటన

అర్థహీనమైన ధరిత్రి స్పందన

క్షణాలదానం

ఈ అనంత సృష్టిలో నేనొక ధూళికణాన్ని.)

అవిరళంగా ప్రవహించే యీ జీవితధారకు

తప్పు తాళం వేయిస్తుంది మృత్యుదేవత

అయినా మానవుడు మూర్ఖుడు - ఇలాగే

ఆలోచిస్తాడు. ఇంతకంటే మానవచరిత్రలో

చిత్రమైన విషయం లేదు.

(స్థబ్ధత ఒక్కసారిగా చీకటి వ్యాపిస్తుంది. మానసి మీద పడుతున్న ప్రకాశం మాత్రం తీక్షణం అవుతుంది.)

అయినా నేను నిర్లజ్జ అధమ కీటకాన్ని

నాలుగు దిక్కుల జీవిత తంతువుల్ని విసురుతున్నాయి.

గంభీర సమస్యల్ని విస్మరించి వున్నాను.

నిగూఢ తత్వ చింతలో నిమగ్నమైవున్నాను.

క్షణిక ధూళి కణాలు

తీవ్ర ప్రాణశక్తిని

అనంత ఘోషతో వెల్లడిస్తున్నాయి.

(మానసిమీదవున్న వెలుగు ఆరిపోతుంది. స్టేజిమీద వెలుతురు పడుతుంది. రచయిత వంటరిగా స్టేజిముందు భాగంలో నిల్చుని వుంటాడు.)

రచ : ప్రాణాల ఉధృత అధికారం ఎవరిప్రాణం? ఇంద్రజిత్, మానసి, నేను. ఇంకాఎవరు ? అమల్, విమల్, కమల్......

(అమల్ ప్రవేశం)

అమల్ : ఏమయ్యా ! కవీ ? ఎలావున్నావు?

రచ : బాగానే వున్నాను.

అమల్ : రాతకోతలు జరుగుతున్నాయా ? లేక మానేశావా?

రచ : అప్పుడప్పుడు రాస్తూనే వున్నాను.

అమల్ : నాటకం పూర్తయిందా?

రచ : ఇంకాలేదు. నువ్వెలా వున్నావు?

అమల్ : నా పరిస్థితులేమీ బాగాలేవు.

రచ : ఏం ? ఏమయింది?

అమల్ : ఏం చెప్పమంటావ్ ? ఈ ఎ . బి . సి . కంపెనీలో ఏమని చేరానో అన్నీ బాధలే ! (సీనియర్ అసిస్టెంటుగా నాలుగు సంవత్సరాలనుంచి చేస్తున్నాను.) ఆరుసంవత్సరాల అనుభవం తర్వాత, అసిస్టెంట్ మేనేజరుగా ఎవర్నో మద్రాసునుంచి తెచ్చిన వ్యక్తిని వేశారు.

రచ : అరే!

అమల్ : ఎందుకడుగుతావులే ? (ఇప్పుడు మద్రాసు వాళ్ళ ప్రాబల్యం ఎక్కువగా వుంది.) బంగాలీ బంగాలీవాడి చేతిలోనే చస్తానంటాడు. అసలు తప్పంతా నాదేలే! P . R . Q కంపెనీనుండి వచ్చిన ఆఫర్లు తిరస్కరించాను. ఇక్కడ ప్రమోషన్లు వుంటాయి. అనవసరంగా ఎందుకు యిక్కడికీ అక్కడికీ తిరగాలనుకున్నాను. నిజం కవీ ! నాకు జీవితంమీద విరక్తికలుగుతోంది.

రచ : ఇంట్లో అంతా కులాసాగా వున్నారా?

అమల్ : ఆఁ, ఏం బాగులే ! ఇలాంటి పరిస్థితిల్లో ఎవరు మాత్రం ఉద్యోగంలోనే వుండిపోవడం) వస్తాను. కొంచెం తొందరపని వుంది.

(అమల్ వెళ్ళిపోతాడు. విమల్ ప్రవేశిస్తాడు.)

విమల్ : ఏమయ్యా కవీ ! ఎలా వున్నావు ?

రచ : బాగానేవున్నాను.

విమల్ : ఏదైనా రాస్తున్నావా? లేక మానేశావా?

రచ : అప్పుడప్పుడూ రాస్తూనే వున్నాను.

విమల్ : నాటకం పూర్తయిందా ?

రచ : ఇంకాలేదు. నువ్వెలావున్నావ్ ?

విమల్ : బాగానేవున్నాను. మా ఫర్మ్ కు హైవే యింజనీరింగ్ కాంట్రాక్ట్ దొరికింది. నాకు రాంచీ ట్రాన్స్ ఫర్ అయింది, రేపు వెళుతున్నాను.

రచ : ఫామిలీని తీసుకెళుతున్నవా ?

విమల్ : తీసుకెళుతున్నాను. క్వార్టర్స్ యిచ్చారు. ఫామిలీ అంటే ఎవర్లే! నా మిసెస్ ను మాత్రం తీసుకెళుతున్నాను. మాకుర్రాణ్ణి పబ్లిక్ స్కూలో చేర్పించాను. అక్కడ నుంచి స్కూల్స్ ఉంటాయో ? ఉండవో?
రచ : అంటే బాగానే వున్నావన్నమాట.

విమల్ : బాగేమిటిలే ! బండి నడుస్తూనే వుంది. వస్తాను. కొంచెం కల్పలతకు వెళ్ళాలి. లాస్ట్ అవర్ షాపింగ్ మిగిలిపోయింది. నువ్వు అటు వస్తే చెప్పు, లిఫ్ట్ యిస్తాను.

రచ : నాకు యిక్కడ కొంచెం పనివుంది.

విమల్ : అయితే నేను వెళ్ళి వస్తాను.

(విమల్ వెళ్ళిపోతాడు. కమల్ ప్రవేశిస్తాడు.)

కమల్ : ఏమయ్యా కవీ! ఎలా వున్నావ్ ?

రచ : బాగానే వున్నాను.

కమల్ : ఇంకా రాస్తున్నావా? మానేశావా?

రచ : మానేశాను.

కమల్ : అవున్లే. ఇన్ని గొడవల్లో హాబీని ఎక్కడ పట్టుకొని కూర్చుంటాంలే. నేను మౌతర్గన్ వాయించే వాణ్ణా ! పూర్తిగా వదిలేశాను. అవునుగాని-నువ్వు యిన్సూరెన్స్ చేయించావా?

రచ : లేదు.

కమల్ : లేదా? ఎంత తాఫీగా చెబుతున్నావ్? ఒక సెక్యూరిటీ అంటూ వుండాలి. ఈ జీవితం శాశ్వతమా? Insure చేయించు- కనీసం పదివేలకయినా-

రచ - ఎవరికోసం Insurance చేయించను ?

కమల్ : అదేమిటి? యింకా పెళ్ళి చేసుకోలేదా ?

రచ : లేదు.

కమల్ : పెళ్ళి చేసుకోవటం ఎంతసేపులే! వెంటనే పిల్లాజల్లా తయారవుతారు. మరీ వయస్సు ముదిరితే ప్రీమియం కట్టాల్సి వుంటుంది. (పెద్దతనంలో కూడా ఇంత ఆధారం కావాలిగా ) ఎంత కడతావో చెప్పు. మిగతా విషయాలు నేను మానేశావా?

రచ : నువ్వు ఉద్యోగం మానేశావా?

కమల్ : నీకేమైనా మతిపోయిందా? ఈ రోజుల్లో ఎవడైనా ఉద్యోగం వదిలేస్తాడా? బిజినెస్ చెయ్యాలనే ఆలోచన కూడా వుందనుకో !(అందులో స్థిరపడితే నౌకరీ, భీమా చేయించే బాధ అన్నీ వదిలించుకుంటాననుకో) కనీసం ఒక ఇరవైఐదు వేలు పెట్టగలిగే పయనీర్ ఎవరైనా నీ దృష్టితో వుంటే చెప్పు. గలిగే చాలా మంచిది. ఫార్టీ పర్సెంట్ ప్రాఫిల్ గ్యారంటీ! కావాలంటే వివరాలు యివ్వగలను.

రచ : అలాంటి వాళ్ళెవరూ నాకు తెలిసినంతవరకూ లేరు.

కమల్ : బాధపడకు. ఎవరో ఒకరు దొరక్కపోరులే! బంగారాన్ని కక్కే స్కీం అనుకో! అలాంటి దానికి ఎవరైనా పెట్టుబడి పెడతారు. నువ్వు మాత్రం ఇన్సూరెన్స్ విషయం సీరియస్ గా ఆలోచించు. (కమల్ వెళ్ళిపోతాడు.)

రచ : వీళ్ళంతా చిన్న చిన్న కణాలు. వీటి చిన్నా పెద్ద సంఘర్షణలే నా నాటకానికి ఇతివృత్తం. అమల్, విమల్, కమల్, ఏవం ఇంద్రజిత్.

(ఇంద్రజిత్ ప్రవేశం.)

ఇం : ఏమిటయ్యా కవీ ! ఏమిటో సంఘర్షణ అంటున్నావ్?

రచ : ఏంలేదు. మానసిని కలుసుకున్నావా?

ఇం : ఇంకా లేదు. కలుసుకుంటాను. ఆ మైదానంలో... (ఇంద్ర వెనక్కు తిప్పుకుంటాడు.)

రచ : ఆ మైదానంలో  అదే చెట్టునీడలో

తృణ తృణం తరు  తరువులో

నిండి వున్నాయి గతస్మృతులు.

జేవితంలో ప్రధమ

యవ్వనపు ఆగమనం

హృదయ కుహరంలోని గుప్తాభావాలు

మూల మూలలా విస్తరించి వున్నాయి.

[ఇంద్రజిత్, మానసి మళ్ళీ అక్కడ కూర్చుంటారు. కబుర్లు చెప్పుకుంటుంటారు. కబుర్లు చెప్పుకుంటుంటారు.]

రోజులు వారాలు గడిపోతాయ్

నెలలు సంవత్సరాల గాడిలోపడి

అన్నీ పాతబడిపోతాయ్

మళ్ళీ అదే కొత్తరూపంలో

తిరిగి తిరిగి వస్తూనే వుంటాయ్

అయినా ఒక్కసారి

అక్కడ ఆ మూల కూర్చుందాం.

ఎన్నో ఎన్నో కబుర్లతో

క్షణాల్ని దొర్లిద్దాం.

[మానసి వచ్చి ఇంద్రజిత్ పక్కనే కూర్చుంటుంది. సంభాషణ ప్రారంభం అవుతుంది. రచయిత పక్కకు తప్పుకుంటాడు.]

ఇం : ఇప్పట్లో ఇక నిన్ను చూడవని అనిపిస్తుంది.

మా : ఏం ?

ఇం : బహుశా దూరం వెళ్ళిపోతాను.

మా : దూరం అంటే ? ఇప్పుడూ దూరంగానే వున్నావుగా?

ఇం : ఇంకా దూరం !

మా : ఇంకా దూరమా ? ఎక్కడికి?

ఇం : లండన్.

మా : లండనా ? అక్కడ ఉద్యోగం దొరికిందా?

ఇం : ఉద్యోగం దొరకలేదు. కానీ అంతవరకు వెళ్ళగలిగే డబ్బు వుంది. ఇంజనీరింగ్ కోర్స్ సీటు వచ్చింది. పాస్ పోర్టుకూడా వచ్చింది. అక్కడికి వెళ్ళాక ఏదైనా ఉద్యోగం కూడా చూసుకుంటాను.

మా : ఉద్యోగం దొరక్కపోతే?

ఇం : దొరుకుతుంది.

మా : ఒకవేళ దొరకకపోతే ?

ఇం ? ఏదో ఒకటి దొరక్కపోదు. నా ఒక్క పొట్టకు ఎంత కావాలి?

మా : ఇలా  తాడు బొంగరం లేని బ్రతుకు ఎన్నాళ్ళని?

ఇం : బ్రతకగలిగినంతకాలం!

మా : నీకు యిలా బ్రతకడం యిష్టంగా వుందా?

ఇం : లేదు.

మా : మరి ?

ఇం : మరి ఏమిటి ?

మా : ఒకచోట ఎందుకు స్థిరపడవు ?

ఇం : స్థిరపడితే సుఖంగా వుంటుందంటావా?

మా : తెలియదు.

ఇం : నాకూ  తెలియదు. ఆ మాటకొస్తే యిష్టం అనే శబ్దం అర్ధం లేనిది. ఇష్టానిష్టాల ప్రశ్నే లేదు.

మా : (కొంచెంసేపు మౌనంగా వుండి ) ఇంద్ర!

ఇం : ఊఁ! చెప్పు !

మా : నన్ను వివాహం  చేసుకుంటే ఒక చోట స్థిరంగా వుండగలవా?

ఇం :  ఇప్పుడు  నేను చెప్పలేను. ఒకప్పుడైతే నీ ప్రశ్నకు సమాధానం యివ్వగలిగేవాణ్ణి.

మా :  నీకు  నా మీద కోపం  రావటంలేదూ?

ఇం : లేదు. ఒకప్పుడు  వస్తూవుండేది. వివాహం అయితే ఎలా వుంటామో చెప్పలేం! బహుశా ఈ మాత్రం ఆత్మీయత కూడా  వుండకపోవచ్చును.

మా : ఆత్మీయత యింకా  పెరిగే అవకాశం కూడా వుండవచ్చుగా?

ఇం : ఎలా  చెప్పగలం ? ఈ విషయంమీద నేను చాలా చాలా ఆలోచించారు. నా ప్రశ్నలకు సమాధానాలు దొరకలేదు. అలసిపోయాను. ఇప్పుడు ఆలోచించాలని లేదు. ఏమీ చెయ్యాలనిపించదు. ఏదో బాధ! కళ్ళు మూసుకొని పడుకోవాలనిపిస్తుంది (మౌనంగా వుండిపోతాడు.]

మా : అలా తిరిగొద్దాం పద!

ఇం : పద!

[ఇద్దరూ లేచి వెళ్ళిపోతారు. రచయిత అలిసిపోయినట్లు ప్రవేశిస్తాడు.]

బాధ!.... బాధ! నేను  బాధితుడను

అర్థం లేని ప్రశ్నల్ని అలాగే ఉండనియ్ !

సంధ్యాకాలపు నీడలో

నన్ను విశ్రామించనియ్

వాక్చాతుర్యంవల్ల ప్రయోజనం?

తర్కవితర్కాల వల్ల ప్రయోజనం ?

తర్కించి తర్కంచి అలిసిపోయాను.

నాకు మిగిలిపోయింది బాధ ఒక్కటే

శూన్య నిర్జవ చాయలో పన్ను నిద్రపోనియ్.

[రెండో అంకం సమాప్తం]

## తృతీయాంకం

[ఒక టేబుల్ చుట్టూ కూర్చొని అమల్ , విమల్ , కమల్ , చీట్లపేక ఆడుతున్నారు. ముగ్గురూ వాళ్ళ వాళ్ళ మాటలు పూర్తిచేసి పేకముక్కలు వేస్తుంటారు.]

అమల్ : 1947 ఆగష్టు 15వ తేదీన భారతదేశం స్వతంత్ర అయింది.

విమల్ : ఇంగ్లీషు వాడి సామ్రాజ్యావాద పంజాలనుండి. విముక్తి అయింది.

కమల్ : ఇప్పుడు మనం  స్వాధీన ఆదర్శ సమాజాన్ని నిర్మించుకోవాలి.

అమల్ : పెట్టుబడిదారీ వ్యవస్థ నాశనం కావాలి. ఫాసిజం సమాజాన్ని వినాశనంవైపుకు తీసుకుపోతూంది.

కమల్ :  కమ్యూనిజం వ్యక్తిస్వాతంత్ర్యానికి గొడ్డలిపెట్టు.

అమల్ : డెమోక్రసీ ద్వారా మార్పుల్ని వెంటనే సాధించలేం.

విమల్ : డెమోక్రసీ  అన్ని దేశాల్లో అన్ని కాలాల్లో శాపంలాగా పరిణమించింది.

కమల్ : సామాన్య మానవుడికి ఏ వ్యవస్థలోనూ సుఖం వుండదు.

అమల్ : దేశంలో ఎక్కడ చూసినా అస్తవ్యస్తం, అరాజకం.

విమల్ : ఈ ప్రభుత్వం లాభంలేదు.

కమల్ : అధికారం హస్తగతం కాగానే అందరూ ఒకటిగానే ప్రవర్తిస్తున్నారు. అందరూ తోడుదొంగలు.

అమల్ : రాజకీయాల్లో వున్న మురికి ఇంకెక్కడా వుండదు.

విమల్ : నా పని - ఏ గూటి చిలక ఆ పాటగా వుంది.

కమల్ : తాతముత్తాతల పేరు నిలబెట్టటానికి, నేను ఎంతో కాలం బ్రతుకననిపిస్తుంది.

అమల్ : ప్రమోషన్ రాలేదు.

విమల్ : క్వార్టరు బొత్తిగా బాగాలేదు.

కమల్ : జీవితం గతుకుల రోడ్డు మీదే నడుస్తోంది.

అమల్ : మా ఇంట్లో జబ్బుగా వుంది.

విమల్ : మావాడు పరీక్ష  తప్పాడు.

కమల్ : నాన్నగారు పోయారు.

అమల్ : అందరికీ అన్నీ...

విమల్ : ఛి, ఛి, ఛీ ...

కమల్ : తస్సాదియ్యా.

అమల్ : విమల్.

విమల్ : కమల్.

కమల్ : అమల్.

అమల్ : విమల్.

విమల్ : కమల్.

కమల్ : అమల్.

[నేపథ్యంలో- "ఏవం ఇంద్రజిత్" అనే మాటలు వినిపిస్తాయి. రచయిత ప్రవేశిస్తాడు.]

అమల్ : ఏమయ్యా కవీ-ఏమిటి విశేషాలు ?

విమల్ : ఏమయ్యా కవీ-ఏమిటి విశేషాలు ?

కమల్ : ఏమయ్యా కవీ-ఏమిటి విశేషాలు ?

రచ : నిన్న ఇంద్రజిత్ ఉత్తరం వచ్చింది.

అమల్ : ఏం రాశాడు?

విమల్ : విదేశం వెళ్ళాడు గదూ ?

కమల్ : ఇంకా తిరిగి రాలేదా?

రచ : పరీక్ష పాసయాడట.

అమల్ : శుభవార్త.

విమల్ : తిరగి రాగానే ఉద్యోగం దోరుకుతుంది. ఇంజనీరింగ్ లైను- చాలా మంచిది.

కమల్ : ఇంకా విదేశ డిగ్రీకి మన దేశంలో చాలా మోజువుంది.

రచ : వింటారా ? ఏం రాశాడో ?

అమల్ : ఆఁ వినిపించు.

విమల్ : చాలా పెద్ద ఉత్తరంలా వుంది.

కమల్ : అయితే నేం?

(రచయిత ఉత్తరం చదువుతూ వుంటాడు. ముగ్గురూ పేక ఆడుతూ వుంటారు మౌనంగా)

రచ : కలకత్తా - భోపాల్ - బొంబాయి- జలంధర్- మిరట్- మద్రాసు -లండన్ - గడచిపోయిన కాలరథపుచక్రాలు- గిర్రున తిరుగుతున్నాయి. అయినా చక్రంలా తిరగడం లేదు. ప్రతి ఆవర్తం - క్రొత్తచక్రంలా వేర్ గా తిరుగుతూవుంది. అదే ట్రాజడీ- ఒకదాన్ని పట్టుకొని - పాతదాన్ని పారేస్తున్నాను. మళ్ళీ కొత్తదాన్ని పట్టుకొంటున్నాను. ప్రతిసారీ ఏదో ఆశించని సంఘటన జరుగుతుందని ఆశిస్తూ వుంటాను. తప్పక జరుగుతుంది. దాని ప్రకాశంలో గతాన్ని పూర్తిగా మర్చిపోతాను. మర్చిపోయిన స్వప్నంలా - నిద్రమెలకువ వచ్చినా - ఆ స్వప్నం తాలూకు- మత్తు వదలనట్లు మర్చిపోతాను. (ఇంతలో ఇంద్రజిత్ వచ్చి, రచయిత ప్రక్కనే నిలుచుంటాడు. అమల్ - విమల్ - కమల్ , పూర్వంలాగే- పేక ఆడుతూ వుంటారు.)

ఇం : కావాలనుకున్నదంతాపొందాను. కాని - ఈ పొందటంలోవున్న , అర్థహీనతను అర్థంచేసుకున్నాను. ఇంకా పొందగలననుకోవటం - ఆ పోందినదాన్ని పోగుచేసుకోవటానికి, నాలుగుచేతులు వస్తాయనుకోవటం ఎంత తెలివి తక్కువ. భూత భవిష్యత్తులు ఒకే తాటికి, రెండు చివర్లు. ఒకదానితో ఒకటి కలవదు - లేకపోతే - భవిష్యత్తును చుట్టి గతంలో పారేశేవాణ్ని. వర్తమానం, ఎప్పుడూ, కనీ కనిపించని భవిష్యత్తుకేసే చూస్తూవుంటుంది. అంటే మృత్యువును వరిస్తుంది.

(అంతకుముందే మానసి వచ్చి వింటూంది.)

మా : మృత్యువును వరించడమా ?

ఇం : ఓహో - అవును. మృత్యువును వరించటం నిజానికి మృత్యువులో సుఖంవుంది. మృత్యువును వరించినవారు ఎందరో సుఖపడ్డారు. భవిష్యత్తునంతా గతంలోనికి ఇమిడ్చి, ఎంత సుఖన్నో అనుభవించి వుంటారు. ఒకరోజు నేనూ, చావవలసినవాణ్ణే. ఇవ్వాళే ఎందుకు చేరకూడదు?

మా : అలా అనకు, నువ్వు బ్రహికివుండాలి.

ఇం : మనిషి బ్రతకాలంటే నమ్మకం కావాలి. భగవంతుని మీద నమ్మకం - అదృష్టంమీద నమ్మకం - పనిమీద నమ్మకం - మనిషిమీద నమ్మకం - తిరుగుబాటుమీద నమ్మకం - తనమీద నమ్మకం - ప్రేమమీద నమ్మకం - ఇందులో ఏ ఒక్క నమ్మకం - నాలో వుందో చెప్పగలవా ! మానసీ-

మా : జీవితంమీద నమ్మకంవుందిగా?

ఇం : జీవితం - పెద్ద పెద్ద ప్రశ్నలకు సమాధానం దొరక్క - చిన్న చిన్న ప్రశ్నలతో రాజీపడి బ్రతకటం -ఇదేగా

జీవితం? మానవజీవితం ? - నేను కోటానుకోట్ల మానవుల్లో ఒకణ్ని. నా జీవితంలోని మిధ్య - కోట్ల జీవితాల మిధ్య.

మా : నీవు ఏం  చేయాలనుకొంటున్నావు ? ఏం చేస్తావు?

ఇం :  ఏం చేస్తానా? అలసి నిద్రపోతాను. నవ్వేసి తేలిగ్గా  నిట్టరుస్తాను. అలా నవ్వేసి, వదలేయాటమే మంచిదిగా కనిపిస్తుంది. జీవితం హాశ్యాస్పదమయింది. హాసనాన్ని ఆపటం, నిరర్ధకం-

(ఇంద్రజిత్ ఆకస్మాత్తుగా అట్టహాసం చేస్తాడు. మానసి రచయిత పక్కలకు వెళ్ళిపోతారు. తెలియకుండా  వాళ్ళు ముగ్గురూ గూడా అట్టహాసం చేస్తారు. రచయిత బాగా స్టేజీముందుకు వస్తాడు. రెండు చేతులూ ఎత్తి ప్రేక్షకులను, వాళ్ళు  నవ్వుతున్నట్లు నవ్వు ఆపటానికి ప్రయత్నిస్తున్నట్లు నటిస్తాడు. అమల్ - విమల్ - కమల్ -  వెళ్ళిపోతారు. వారినవ్వూ క్రమంగా తగ్గిపోతుంది.)

రచ : అలా నవ్వకండి. మీకు నమస్కారం చేస్తాను. కాస్త  ఆ నవ్వు ఆపండి. నిజమే-నాటకం- రాయటం నావల్ల అవటంలేదు. మీరు చూస్తూనే వున్నారుగా నేను  ఎంత ప్రయత్నిస్తున్నానో?

అమల్ , విమల్ , కమల్ వాళ్ళ నాటకం ఇంద్రజిత్.

(పిన్ని ప్రవేశిస్తుంది)

పిన్ని : భోజనానికిరావా?

రచ :రాను.

(పిన్ని వెళ్ళిపోతుంది. మానసి ప్రవేశిస్తుంది.)

మా : భోజనం చెయ్యవా ?

రచ : (రెండు చేతులతో ముఖాన్ని దాచుకొంటూ) నువ్వు  కూడా....?

మా : పొరపాటయింది రాస్తున్నావా?

రచ " ఎలా రాయను? ఇంద్రజిత్ తిరిగి రాడు. మూడు సంవత్సరాల్లో మూడు  ఉత్తరాలు రాశాడు.మూటిలోను ఒకటే ధోరణి...

మా : ఏమిటి?-

రచ : ఏముంది. తిరుగుతున్నాడు. చక్రంలా  తిరుగుతూనే వున్నాడు. చావటంలేదు. రకరకాల స్వప్నాలు బుర్రలో తిరుగుతున్నాయి. కాని, చావురాదు. జీవితాన్ని దాని అసలు రూపంలో చూసేవాణ్ని. జీవితాన్ని స్వప్నంలా తలచేవాణ్ని గురించి ఏ నాటకం వ్రాయను.

మా : అలాంటివాణ్ని గురించే నాటకం రాయాలి?

రచ : లాభంలేదు. ఎన్నిసార్లు అతణ్ని సంఘటనా చక్రంలో ఇరికించటానికి ప్రయత్నించానో అన్నిసార్లూ - అతను ఆ చక్రం బయటకెళ్ళి పడుతూనే వున్నాడు. ఇది వాస్తవంకాదు అంటాడు. అతనిచేత ఎన్నో చెప్పించాలని ప్రయత్నిస్తాను. ప్రతిసారి - సంభాషణ పరిధిని దాటి వెళ్ళిపోతాడు. ఇది వాస్తవం కాదు అంటాడు. అతనికి చాలా విషయాలు తెలుసు. అవసరమైన దానికంటే ఎక్కువగా తెలుసుకొన్నాడు.

మా : అయినా అతను కలలు కనటం మానలేదు.

రచ : కలలు ఎప్పుడో ఒకప్పుడు కరిగిపోతాయిగా.

మా : అవును, అదినాకూ - తెలుసు.

రచ : అలాంటప్పుడు.

మా : కరగిపోనియ్.

రచ : ఆ, తర్వాత ?

మా : ప్రవాహాన్ని దాటటానికి, స్వప్నాల ఆధారం వుండదుగా?

రచ : లేకపోతే  మునిగిపోతాడు.

మా : మునిగిపోతే పోనియ్. అప్పుడైనా భవిష్యత్ ఆధారం దొరుకుతుంది. అక్కణ్ణుంచే  జీవితం ప్రారంభం కావచ్చును.

రచ : ఇదంతా నీకు ఎలా తెలుసు ?

మా : ఎలా తెలిసిందా ?ఏమిటి తెలిసింది? నాకు ఏమీ తెలియదు. నేను ఒక మూర్ఖురాలిని. నాకు తెలిసిందంతా - నమ్మటం మాత్రమే.

(మానసి వెళ్ళిపోతుంది.)

రచ : నమ్మకం ! పాతాళంమీద నమ్మకం.

(ఇంద్ర ప్రవేశిస్తాడు.)

ఇం : (కవిత)-

ఆస్తికత్వపు, బలహీనతలో ఈదుతున్నాను.

జీవిత భారాన్ని తృణంమీద వేసి ఈదుతున్నాను.

పొగమంచు నిట్టూర్పుల్లో-

వాక్కున్నాయి. తీరాలు రెండూ

ఈ ప్రవాసంలో తెలుసుకున్నాను.

ఒక తథ్యాన్ని-

మేఘాలమాటున కన్పించే

స్వర్ణ సామ్రాజ్యం.

నక్షత్రమాలికల్లో

తేలిపోతున్నా స్వర్ణపూచాయ

అన్నీ మిధ్యేవని తెలుసుకున్నాను.

నిన్ను నేను  కోరేది ఒక్కటే.

మిధ్యావచనాలతో

నమ్మించకు ఈ లోకాన్ని

పరంపరాగతంగా వస్తున్న

ఆస్థ ! విశ్వాసాలను తొలగించు

నీ మనః పటలంనుండి-

(స్వయంగా మునిగి చూడు భూమి ఎంత లోతుగా వుందో)

మానవుడు క్రియా శీలుడు.

మునిగికూడా తప్పిపోడు.

అధికారాన్ని హస్తగతం చేసుకోటానికి

వెనుకాడడు వెళ్ళడానికి

పాతాళానికైనా-

రచ : ఇంద్రజిత్ !

ఇం : ఏమిటి ?

రచ : నువ్వు తిరిగి వచ్చావా?

ఇం : అవును.

రచ : ఎప్పుడు వచ్చావ్ ?

ఇం : చాలాకాలం అయింది.

రచ : ఇంతకాలం ఎక్కడున్నావ్ ?

ఇం : కలకత్తాలో -

రచ : ఏం చేస్తున్నావ్ ?

ఇం : ఉద్యోగం.

రచ : వివాహం చేసుకున్నావా?

ఇం : చేసుకున్నాను.

రచ : అంటే చివరకు, మానసి ఈ వివాహానికి ఒప్పుకుందన్న మాట.

ఇం : లేదు.

రచ : ఆఁ.

ఇం : మరొక అమ్మాయిని చేసుకున్నాను.

రచ : మరొక అమ్మాయినా ?

ఇం : అవును.

రచ : ఆమె ఎవరు ?

ఇం : ఒక స్త్రీ.

రచ : పేరు ?

ఇం : మానసి.

రచ : అదెలా సంభవం ?

ఇం : ఈ ప్రపంచంలో సంభవంకానిది ఏదీ లేదు. ఎంత మంది మానసీలు వస్తున్నారో వెళుతున్నారో. అందులో ఒక మానసితో వివాహం జరుగుతుంది.

మానసి. సోదరి మానసి - మానసి స్నేహితురాలు

మానసి- మానసి కూతురు మానసి.

రచ : అమల్, విమల్ , కమల్ లాగా!

ఇం : అవును. అమల్ , విమల్, కమల్, ఏవం ఇంద్రజిత్.

(మానసి ప్రవేశిస్తుంది. తలమీద ముసుగు వుంటుంది)
రా ! రా  పరిచయం చేస్తాను. ఈమె నా భార్య. మానసి. (మానసితో) ఇతను నా స్నేహితుడు రచయిత.

రచ : నమస్కారం.

మా : నమస్కారం. మీరు ఏం రాస్తుంటారు?

రచ : ఎప్పుడు ఏం  రాయాలనిపిస్తే అది.

మా : ప్రస్తుతం ఏం రాస్తున్నారు?

రచ : ఒక నాటకం. రాయటానికి ప్రయత్నం చేస్తున్నాను.

మా : నాకు వినిపిస్తారా?

రచ : తప్పకుండా ముందు కానివ్వండి.

మా : ఇంకా  ఎంత రాయాలి?

రచ : ఎంతో లేదు. ఇవ్వాళో, రేపో ప్రారంభిస్తాను.

మా : ఇంకా ప్రారంభించలేదా?

రచ : ఎక్కడా ? కుదరటం లేదు.

మా : ఇప్పుడేగా  అన్నారు. పూర్తి గావటానికి ఎంతో లేదని?

రచ : ఈ నాటకం ప్రారంభానికీ, ముగింపుకు అట్టే తేడా వుండదు. వృత్తాకారంగా వుంటుంది.

మా : మీ మాటలు నాకు  అర్థం కావటంలేదు.

ఇం :  ఎలా అర్థం అవుతాయి మానసీ - మాట్లాడేది అర్థం కావాలని కాదుగా?

మా : బలే ! ఇతర్లకు అర్థం కావలెననేగా మాట్లాడేది.

ఇంద్ర : అది  ఒక్కప్పటి సంగతి. ఇప్పుడు మాట్లాట్టం అలవాటయింది కనుక మాట్లాడుతున్నాం.

మానసి : ఇక ఆపండి. అర్థంలేని మాటలు.

ఇంద్ర : నేనంటూందీ - అదేగా ?

(అమల్ , విమల్ , కమల్ , ప్రవేశిస్తారు. స్టేజీకి రెండో వైపుగా నిలుచుని మాట్లాడుతూ వుంటారు)

మానసి : వాళ్ళంతా ఎవరూ?

రచ : అమల్ - విమల్ - కమల్ .

అమల్ : ధనతంత్రం -రాజతంత్రం-గణతంత్రం.

విమల్ : సామ్రాజ్యవాదం -నాజీవాదం- మార్క్సవాదం.

కమల్ : ఆర్థికశాస్త్రం - టెండర్ -స్టేట్ మెంటు.

విమల్ :రిపోర్టు-మినిట్సు-బడ్జటు.

కమల్ : మీటింగ్ - కమిటీ - కాన్ఫరెన్సు.

అమల్ : సభ్యత - విద్య - సంస్కృతి.

విమల్ : సాహిత్యం - వేదాంతం- చరిత్ర.

కమల్ : బహ్మ - నిర్మాణం - భూమి.

అమల్ : రాజ్ కపూర్ - మాలాసిన్హా - బిస్వజిత్.

విమల్ : ఉమ్రీగర్ - కృష్ణన్ - మిల్కాసింగ్.

కమల్ : హేమంతకుకుమార్ - S.D బర్మన్ - లతామంగేష్కర్.

అమల్ : డాక్టర్ - హోమియోపథి - కవికుమారు.

విమల్ : ట్రాం - బస్ - ట్రైన్.

కమల్ : సున్నితం - చెత్తా - దోమలు.

అమల్ : కూతురు -కొడుకు - భార్య.

విమల్ : మాస్టరు - డ్రైవరు - నంటవాడు.

కమల్ : మరదలు - మేనల్లుడు - మామ.

మానసి :  వాళ్ళంతా ఏమిటి అంటున్నారు?

ఇంద్ర : మాట్లాడుతున్నారు.

(అమల్ , విమల్ , కమల్ చేతులు వూపుతూ మాటలు వినిపించకుండా మాట్లాడుతూవుంటారు.)

మానసి : ఏమాటలు ?

ఇంద్ర : నాకూ తెలియలేదు. కవిగార్ని అడిగిచూడు.

మానసి : (రచయితతో ) ఇంతకంటే మాట్లాట్టానికి వేరే మాటలే లేవా?

రచ : ఉండే వుండాలి. తప్పకవుండాలి.

(ముందుకొచ్చి ప్రేక్షకులను ఉద్దేశించి ప్రశ్నిస్తాడు.)

ఇంతకంటే మాట్లాట్టానికి ఏమీలేదా?

(ప్రేక్షకులు మౌనం) లేదా? (మళ్ళీ మౌనం)

నేను ఎవర్ని  గురించి నాటకం రాయాలి?

ఈ మాటల్ని తీసుకొనా? ఇలాంటి నాటకంలో వేషం ఎవరేస్తారు?

(ఇంద్ర , మానసి వెళ్ళబోతారు.)

ఇంద్రజిత్ ! వెళ్ళవద్దు.

(మానసి వెళ్ళిపోతుంది. ఇంద్రజిత్ తిరిగోస్తాడు.)

రచ : ముందు చెప్పివెళ్ళు !

ఇంద్ర : ఏం చెప్పాలి ?

రచ : మానసి  ఎక్కడవుంది ?

ఇంద్ర : ఇప్పుడేగా  ఇక్కడనుంచి వెళ్ళింది ?

రచ : ఈ మానసికాదు. నిజామాబాద్ లో వుంటూవుండేది ఆ మనసి. ఆమె ఎక్కడుంది?

ఇంద్ర : నిజామాబాద్ లో వుంది.

రచ : ఆమెకు ఉత్తరాలు రాయటంలేదా?

ఇంద్ర : రాస్తూనే వుంటా !

రచ : ఆమెను కలుస్తూ వుంటావా?

ఇంద్ర : అప్పడప్పుడు.

రచ : ఎక్కడ?

ఇంద్ర : ఆ మైదానంలోనే - ఆ చెట్టుక్రిందే !

రచ : మాట్లాడుతూవుంటావా ?

ఇంద్ర : మాట్లాడతాను.

రచ : ఏం మాట్లాడతావు ?

ఇంద్ర : ఇంతకాలం ఏం మాట్లాడేవాణ్ణో అవే మాటలు. ఆమె గురించి.....నా గురించి...

రచ : ఆ మాటలు కూడా అమల్ , విమల్ , కమల్  మాట్లాడుకొనే మాటల్లాగే వుంటాయా?

(ఇంద్ర జావాబివ్వడు.)

రచ : చెప్పు యింద్రజిత్ !

(ఇంద్ర అప్పటికే మాట్లాడడు. ఆ వెనకవున్న మైదానములోకి, అదే చెట్టుక్రిందకు వెళ్ళిపోతాడు. నిజామాబాద్ లో వుండే మానసి వస్తుంది.)

మానసి : మాట్లాడు !

ఇంద్ర : ఏం మాట్లాడను.

మాన : యింతకు ముందు చెబుతున్న విషయమే !

ఇంద్ర : యింతకు ముందు ఏం చెబుతున్నాను?

మాన :అదే నీ సంసారాన్ని గురించి !

ఇంద్ర : ఆఁ అవునుగదూ ! నా భార్య యింటిపనులు చూస్తూంది. నేను ఉద్యోగం చేస్తున్నాను. నా భార్య సినిమాకు వెళుతుంది ! నేను ఆమె వెనకే వెళతాను. నా భార్య పుట్టింటికి వెళుతుంది. నేను హోటల్లో భోజనం చేస్తాను. ఆమె తిరిగి వస్తుంది. నేను బజారుకు వెచ్చాలు కొనడానికి వెళతాను.

మాన : ఇందతా ఎందుకు చెబుతున్నావు ?

ఇంద్ర : నా సంసారాన్ని గురించి చెప్పమని నువ్వే అడిగావుగా?

మాన : ఇలాంటి విషయాలనా నేను చెప్పమన్నది?

ఇంద్ర : మరి ఎలాంటి విషయాలు ?

మాన : నీ గురించి చెప్పు !

ఇంద్ర : నా గురించా ? నేను ఒక్క రైల్వేట్రాక్ ను పట్టుకొని నడుస్తున్నాను. తిన్నగా రైల్వేలైను వెంట వెనక్కి తిరిగిచూస్తూ దూరంగా ఒక చోట ఆ రెండు పట్టాలూ కలిసినట్టు కన్పిస్తాయి. ఎదురుగా చూస్తాను, దూరంగా ఒక బిందువు దగ్గర పట్టాలు కలిసినట్టే కన్పిస్తాయి. నేను ఎంత ముందుకు నడుస్తానో ఆ బిందువు కూడా అంత

ముందుకు జరుగుతూ కన్పిస్తుంది. వెనక కన్పించేదే ముందూ కన్పిస్తుంది. గతానికీ, భవిష్యత్తుకూ భేదం కన్పించదు. గతంలో కన్పించిందే, భవిష్యత్తులో వుంది.

మా : ఆ తర్వాత ?

ఇం : ముందునుంచిగానీ వెనకనుంచికానీ రైలు, ఏదైనా ఒక బండి వస్తుంది అనుకుంటూ వుంటాను.

మా : బండివస్తే ఏం చేస్తావు ?

ఇం : పట్టాలమీదనుంచి దూకి పక్కకు వెళతాను. లేకపరుగెత్తుతాను. అదీ యిదీ కాకపోతే బండికిందపడినలిగిపోతాను. ఏదో ఒకటి జరుగుతుందిగా? కాని అలా జరగదు. ఎందుకంటే ఆ లైనుమీదకు బండి రాదని నాకు తెలుసు. అందుకే అనుకుంటూవుంటాను.

మా : ఏమనుకుంటూవుంటావు ?

ఇం : అనుకొంటూవుంటాను - ఇక నడవడం మానేద్దామని. నడవడంవల్ల ప్రయోజనం కనిపించదు. అంతగా అయితే ఆ లైనుమీద పడుకుంటాను.

మా : (కొంచెంఆగి) అలా జరగటానికి వీల్లేదు ఇంద్రా !

ఇం : ఏం ?

మా : ఎదురుగా మార్గం కనిపిస్తున్నప్పుడు ముందుకు నడిచితీరాలి.

ఇం : చాలాదూరం నడిచాను.

మా : ఇంకా చాలాదూరం నడవాలి ఇంద్రా !

ఇం : నేను అలిసిపోయాను.

మా : అయినా నడవాలి.

ఇం : ఎందుకు? ఎందుకు ? ఎందుకు ? ఒకటేమార్గం - ఆ మార్గంలో నడుస్తున్నాను. నడుస్తూనే వున్నాను. అయినా

**నిష్కృతి**

అర్ధ హృదయం, క్షుధిత మధ్యాహ్నం

ఖండితదినం

నిర్జన నిద్రాహీనరాత్రి

నేను  ఉన్నాను.

ఇంకా మిగిలి ఉన్నాను -చైతన్యం వుంది.

అన్నీ ఉన్నాయి జ్ఞాపకం

ఇంకా జీవితం ఎంతోవుంది.

కాంతి దూరమై శాంతి లభిస్తుందని

ఆశపడుతూ ముందుకు నడుస్తున్నాను

లేస్తూ పడుతూ అలిసిన రెక్కల

మీద భారం వేస్తూ

(క్షణక్షణానికీ కణకణం వ్యాపిస్తూ గతసౌభాగ్యానికి చూర్ణంచేస్తూ)

నిరంతరం కాలాచక్రం తిరుగుతోంది.

అబద్దాల బెలూన్ వున్నాను.

గాలి ఊదుతూనే వున్నాను.

అయినా నిష్కృతిలేదు.

(నీకు తెలియందేమీ లేదు

అన్నీ  తెలుసు నీకు

నీతో పాటు మధురఝుంకారాన్ని తెస్తావు.

ప్రకాశాన్నీ , మత్తునూ తెస్తావు

శుభ్ర వస్త్రాల మాటున

గప్పివున్న మురికి నీకు తెలుసు.)

సమక్షంలోవుంది

జీర్ణ పురాతన దారంలో గుచ్చిన

పూలహారం-

వాడటానికి సిద్ధంగావున్న  పూలు

నీకు  తెలుసు

నా జీవితానికి అవసానం లేదనీ.

నేనే ఒక మృత పదార్థాన్ననీ

అయినా అంటావు

నడవమని...ముందుకు నడవమని

నాకు యింకా నిష్కృతిలేదా ?

ఇం : ఎందుకు నడవాలి?

మా : ఎదురుగా మార్గంవుంది కనుక !

ఇం : ఎందుకు నడవాలి? మార్గంచివర ఏముంది? దేనికోసం నడవాలి?

మా : అందరూ ఎందుకు, దేనికోసం నడుస్తున్నారు?

ఇం : అందరా ?
(ఎదురుగా అమల్ వస్తాడు. రచయితను కలుసుకుంటాడు.)

రచ : అమల్ ! ఎక్కడికీ ప్రయాణం ?

అమల్ : పరీక్ష వ్రాయడానికి వెళుతున్నాను.

రచ : పరీక్షా ? ఈ వరస్సులోనా?

అమల్ : ఇన్ స్టిట్యూట్ ఆఫ్ లెటర్ మన్ షిప్ పరీక్ష. పోయిన సంవత్సరంకూడా రాశాను. కాని పాసుకాలేదు. మరోసారి ప్రయత్నించి చూద్దామని కరస్పాండెన్స్ కోర్స్ తీసుకున్నాను.

రచ : ఈ పరీక్ష ప్యాసయినందువల్ల లాభమేమిటి ?

అమల్ : లాభంవుంది. ఈ పరీక్ష ప్యాసయితే ప్రమోషన్ వస్తుంది. (మేనేజరు అయే అవకాశంకూడా ఉంటుంది.) వస్తాను. ఆలస్యం అవుతుంది.

(అమల్ వెళ్ళిపోతాడు. విమల్ వస్తాడు.)

రచ : అరే ! విమల్ ! ఎక్కడకు ?

విమల్ : సిమెంటు పర్మిట్ కోసం వెళుతున్నాను. (కాస్త తగాదా పడ్తేగాని పైలు కదల్దు.)

రచ : సిమెంటు ఎందుకు?

విమల్ : ఇల్లు కట్టిస్తున్నాను. (సి . ఐ . టి. స్కీంలో స్థలం కొన్నాను. దాని ఖరీదు ఆరున్నరవేలు. వేలం పాటలో తొమ్మిది వేలదాకా ఎక్కింది. స్థలాల వెలలగురించి అడక్కూడదు. ఇల్లు కట్టడానికి డబ్బు ఎక్కడనుంచి వస్తుంది చెప్పు?) గవర్నమెంట్ లోన్, ఇన్ ష్యూరెన్స్ లోన్, అన్ని లోన్సూ తీసుకున్నా రెండు అంతస్థులకంటే ఎక్కువ కట్టలేకపోతున్నాను.

రచ : అసలు యిల్లు కట్టడం ఎందుకు తలపెట్టావ్ ?

విమల్ : మరేం చెయ్యమంటావ్ ? (ఈ రోజుల్లో డబ్బుకు విలువ లేకుండా పోయింది.) ఇల్లుంటే పెద్దతనంలో తల దాచుకోటానికి ఇంత నీడైనా దొరుకుందని.
(పిల్లల విషయంకూడా ఆలోచించాలిగా?) వెళ్ళనా?

ఆలస్యం అవుతుంది.

[విమల్ వెళ్ళిపోతాడు. కమల్ ప్రవేశిస్తాడు]

రచ : కమల్ ! ఎక్కడికి బయల్దేరావ్ ?

కమల్ : చంద్రం ఆఫీసుదాకా. ఎవరో ఫైనాన్స్ చేసేవాడు వున్నాడని చంద్రం చెప్పాడు. మాట్లాడదామని.

ఇం : ఏం మాట్లాడతావ్ ?

కమల్ : మంచి బిజినెస్ స్కీం ఒకటి వుంది. చాలా మంచి స్కీం. (ఇంపోర్టు లైసెన్సు దొరికేలా వుంది. అసెంబ్లింగ్ పెద్దకష్టం కాదు. చాలా మంచి మార్కెట్ వుంది.) వస్తువులు బజారు చూడనక్కరలేదు. అడ్వాన్సు బుకింగ్ దొరుకుతుంది. కేవలం పెట్టుబడి కావాలి.(నేనూ , చంద్రం కొంత అప్పు తీసుకున్నాం అది చాలదు.) ఫిఫ్టిన్ పర్సెంట్ మీద కూడా అప్పు పుట్టడం లేదు.

రచ : డబ్బు లేకుండా వ్యాపారం ఎందుకు తలపెట్టావ్ ?

కమల్ : మరి ఏం తినమంటావ్! భగవంతుడి దయవల్ల ఆరుగురు పిల్లలు పుట్టారు.

(మా అమ్మాయి టైఫాయిడ్ లో వెయ్యి రూపాయిలు ఖర్చు పెట్టాను. మూడోవాడికి స్కూల్లో ప్రమోషన్ లేదు. ఒక సంవత్సరం ఫీజు దండగ అయింది. ఈ విధంగా ఎంతవరకు నడుస్తుంది.)

ఆలస్యం అవుతుంది వెళ్తాను.

[కమల్, రచయిత యిద్దరూ వెళతారు.]

ఇం : అంతా యింతే ! అమల్, విమల్ , కమల్ .

మా : వాళ్ళు నడుస్తూనే వున్నారు.

ఇం : వాళ్ళంతా సుఖంగానే వున్నారు మానసీ! వాళ్ళకు ఓ లక్ష్యం వుంది. ఆశలు వున్నాయి. స్వప్నాలు కంటున్నారు.

మా : అవన్నీ నీకెందుకు లేవు.

ఇం : అలాంటివేవీ నాకు లేవు.

మా : ఎప్పుడూ లేవా?

ఇం : ఒకప్పుడు వుండేవి. నేను ఏదో చెయ్యాలనుకొంటూ వుండేవాణ్ణి. ప్రకాశవంతమైన ఒక నక్షత్రంలా ఆకాశాన్ని ఆ మూలనుంచి యీ మూలకు చీల్చుకొంటూ వెళ్ళాలనుకునే వాణ్ని. నక్షత్రం కాలి, నుసి అయేదాకా వెలగాలనుకునేవాణ్ని.

మా : నువ్విప్పుడు కాలి నుసి అయిపోయావా ?

ఇం : కాలేదు. అసలు నక్షత్రంలా వేలగందే? ఆకాశంలో నక్షత్రం...నేను భూమినుంచి ఆకాశంవైపుకి పయనించలేకపోయాను.

మా : ఎందుకని?

ఇం : నాకంత శక్తిలేదు. అలాంటి శక్తి సంపాదించాలని కలలు మాత్రం కన్నాను. నేను ఒక అతి సాధారణ మానవుణ్ణని తెలుసుకున్నాను. తెలుసుకోనంతవరకూ స్వప్నాలలో బ్రతికాను. ఈనాడు ఒప్పుకుంటున్నాను నా అల్పత్వాన్ని.

మా : ఇంద్రజిత్ !

ఇం : నన్ను ఆ పేరులో పిలవకు. నేను ఇంద్రజిత్ ను కాను. నా పేరు నిర్మల్ ! అమల్, విమల్ , కమల్, నిర్మల్ నేనూ వాళ్ళలాటివాణ్ణే!

(మాట్లాడుతూ వ్యాకులపడతాడు. రచయిత వచ్చి వెనక నిల్చుంటాడు. మానసి కూర్చొని వుంటుంది.)

రచ : ఇంద్రజిత్ !

ఇం : మీరు మర్చి పోయినట్లున్నారు - నా పేరు నిర్మల్ .

రచ : నన్ను గుర్తించలేదా ? ఇంద్రజిత్ !

ఇం : ఎవరు ? నువ్వా ? కవి !

రచ : నేను నాటకం పూర్తి చెయ్యలేకపోతున్నాను ఇంద్రజిత్!

ఇం : పూర్తిచేసి ప్రయోజనం ? దాని మొదలూ, తుదీ ఒకటిగానే వున్నప్పుడు ? దానికి ముగింపు వుంటేగా?

రచ : అయినా వ్రాయాలిగా ?

ఇం : వ్రాయాలనుకుంటే వ్రాయి. నాకేం సంబంధం లేదు. నేను నిర్మల్ ని.

రచ : నీకు సంబంధం ఏమీలేదా? ఇల్లు, ప్రమోషన్, బిజినెస్ ఇవేమీ అక్కర్లేదా? ఆలాంటప్పుడు నువ్వు నిర్మల్ ఎలా అవుతావు?

ఇం : నేను  కూడా అతి సామాన్యమైన వ్యక్తినే !

రచ : కావచ్చు. కానినువ్వు నిర్మల్ వి కాదు. నేనూ సామాన్యమైన వ్యక్తినే అయినా నిర్మల్ ని  కాలేను. నువ్వూ, నేనూ, నిర్మల్ కాలేము.

ఇం : మరి మనం దేని ఆధారంమీద బ్రతకాలి?

రచ : కనిపించే మార్గమే మనకు ఆధారం. మనం నడవాలి. వ్రాయటానికి నాకు సామగ్రి లేదు - అయినా  రాస్తాను.

మాట్లాట్టానికి నీకు విషయం లేదు. అయినా నువ్వు మాట్లాడుతావు. మానసికి జీవించటానికి ఆధారం లేదు - అయినా జీవిస్తుంది. మన ఎదురుగా మార్గం వుంది. మనం నడవాలి నడుస్తాం.

ఇం : దేవరాజు జూపిటర్ యిచ్చిన శాపఫలితంగా 'సిసిఫస్' ప్రేతాత్మ. ఒక పెద్ద బండరాతిని నెట్టుకుంటూ కొండశిఖరాన్ని చేరుతుంది. కాని కొండశిఖరం చేరగానే ఆ రాతిబండ క్రిందకు దొర్లిపోతుంది. మళ్ళీ అతని ప్రేతాత్మ ఆ రాతిని నెట్టుకొంటూ కొండశిఖరం చేరుతుంది. మళ్ళీ ఆ రాయి క్రిందకు దొర్లుతుంది.

రచ : మనంకూడా అలాంటి ప్రేతాత్మలమే ! ఆ రాయి దొర్లుతుందని మనకు తెలుసు. రాతిని నెట్టుకొంటూ పైకి వెళ్ళిన మనకు మన శ్రమంతా అర్థం లేనిదని మనకు తెలుస్తుంది. కొండశిఖరానికి కూడా ప్రయోజనం లేదని మనకు తెలుసు.

ఇం : ఇంత తెలిసీ మనం ఆ రాతిని నెట్టాల్సిందేనా ?

రచ : అవును. తెలిసీ చెయ్యాల్సిందే! మనకు ఆశలు లేవు. ఎందుకంటే భవిష్యత్తు ఏమిటో మనకు తెలుసు. మన దృష్టిలో గతానికీ, భావిష్యత్తుకూ భేదం లేదు. అంతా ఒకటే. మన వెనక వున్నదే ముందూ వున్నదనే విషయాన్ని మనం తెలుసుకున్నాం.

ఇం : అయినా బ్రతకాలంటావ్ ?

రచ : అవును. తప్పదు. మన ముందు మార్గంవుంది. మనం నడుస్తూనే వుండాలి. మనకు తీర్ధంలేదు - తీర్ధయాత్ర మాత్రమే వుంది.

(మానసి వచ్చి రచయిత, ఇంద్రజిత్ ల మధ్యలో నిల్చుంటుంది. ముగ్గురుదృష్టి తిన్నగా చూస్తుంది. కొంచెం పైకి వుంటుంది. ప్రేక్షాగారపు గోడను చీల్చుకుంటూ ఎక్కడికో చాలా దూర తీరాలకు పయనిస్తున్నట్లు ఉంటుంది. మార్గపు యిరువైపు రేఖలూ ఎక్కడో కలిసే చోటును చూస్తున్నట్లు వుంటుంది. వారిదృష్టి నాలుగువైపుల అంధకారం, ఒక క్షీణ ప్రకాశ రేఖ వారిమీద పడుతుంది. దూరంగా పాట వినిపిస్తుంది.)

అనంతమైనదీమార్గం

ఆగని పయనం

దూరంగా దేవలోకాన్ని పొందే

ఆశలేని ప్రయాణం

అందుకే అర్ధహీనమైంది ఈ ప్రయాణం

ఉద్దేశ్యం హీనం.

అయినా లేదు  విచారం.

సాగుతూనే వుంటుంది ఈ ప్రయాణం.

అభీష్టం, ప్రశ్నలు అన్నీ

పడిపోయాయి అంతుతెలియని లోతులో

దుఃఖం మర్చి పోయాను

జీవితపు స్వర్ణోదయంలో

తీసుకున్నాను దీక్ష

చేస్తున్నాను అనంత ప్రయాణం

జీవన సంధ్య ప్రవేశంతో

మరువలేను యిది కేవలం

తీర్ధయాత్రయే, తీర్ధంకాదని

లక్ష్యంలేదు. మార్గం వుంది.

ఇదే తీర్ధమార్గం.

ఇదే అభీష్టం.

ఇదే గంతవ్యం.

**(శుభం)**